# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 17 జూన్ 2025 | సంపుటి:9 | సంచిక:171 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## ఈపీఎఫ్ చందాదారులకు అలర్ట్




2

## ఇది యుద్ధాల శకం కాదు

### చర్చలతోనే శాంతియుత పరిష్కారం పొందాలె

పశ్చిమాసియా, యూరోప్‌ల్లో ఘర్షణలపై ప్రధాని మోడీ

సైప్రస్‌తో భారత్ బంధం మరింత సుధృఢమైందన్న ప్రైమ్ మినిస్టర్



మోడీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

**నికోసియా/ ఢిల్లీ, జూన్ 16:** ఆపరేషన్ సిందూర్ సమయంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి నిరంతరం మద్దతు ఇచ్చినందుకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్‌కు ప్రధాని మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల పశ్చిమాసియాలో తలెత్తుతున్న ఉద్రిక్తతలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా, యూరప్ లో కొనసాగుతున్న సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందవచ్చని అన్నారు. ఈయూ అధ్యక్షపదవి సైప్రస్ కు దక్కడంపై ఆ దేశానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేశ నాయకత్వంలో ఈయూతో భారత్ కు మరింత మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశం ఈయూ మద్దతు సాధిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

**ఇదొక సువర్ణావకాశం..**

ఈ పర్యటనను ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం లిఖించేందుకు సువర్ణావకాశంగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై పరస్పర విశ్వాసం ఇరుదేశాల సంబంధాలకు బలమైన పునాదిగా

...మిగతా 2లో

### జీ7 శిఖరాగ్రం షురూ

కెనడాలోని ఆల్బర్టాలోని కనానాస్కిస్ వేదికగా జీ7 శిఖరాగ్ర సదస్సు ఆదివారం ప్రారంభమైంది. భారత ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సదస్సుకు హాజరయ్యారు.



# యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

## విశాఖ యోగా దినోత్సవంతో గిన్నీస్ రికార్డు

### విశాక బీచ్‌లో యోగా ఏర్పాట్లు పరిశీలన

### అధికారులకు పలు సూచనలు చేసిన బాబు



**విశాఖపట్నం:** యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిరంతర శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విశాఖలో ఈ నెల 21న నిర్వహించబోతున్న యోగా దినోత్సవ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. యోగా దినోత్సవ ఏర్పాట్లపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సీఎంకు వివరించారు. భద్రత ఏర్పాట్లపై డీజీపీ హరీశ్‌గుప్తా వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల తర్వాత అతిపెద్ద యోగా కార్యక్రమం చేపడుతున్నాం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులకు ఎక్కేలా ఏర్పాట్లు పర్యవేక్షించాలి. సెక్రటేరియట్ యూనిట్ సిబ్బంది పర్యవేక్షణ ఏర్పాట్లు చేయాలి. క్షేత్రస్థాయిలో ఇతర సిబ్బందిని ఏర్పాటు చేస్తే జవాబుదారీతనం ఉండదు. సెక్రటేరియట్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పని చేయాలి. యోగా నిర్వహణలో కొత్త రికార్డు సృష్టించబోతున్నాం. దాదాపు 3.4 లక్షల మందికి ఒకే ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు. అంతకుముందు యోగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. ఆర్కే బీచ్ వద్దకు వెళ్లి జిల్లా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వీఐపీల భద్రత తదితర అంశాలపై అధికారులు సీఎంకు వివరించారు. విశాఖపట్నం నగరంలో నిర్వహించే యోగా కార్యక్రమంతో

...మిగతా 2లో

### మాపై నమ్మకంతో ఎన్డీయేను ప్రజలు మూడుసార్లు గెలిపించారు: పురందేశ్వరి



**రాజమహేంద్రవరం:** ప్రజలు తమపై నమ్మకంతో కేంద్రంలో మూడుసార్లు ఎన్డీయే కూటమిని గెలిపించారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రభుత్వ సుపరిపాలన, పేదల సంక్షేమంపై రాజమహేంద్రవరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.''2047 నాటికి మనం 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలి. ప్రధాని మోదీ ఏ పథకం చేపట్టినా పేదలను కేంద్ర బిందువుగా చేసుకుని కార్యక్రమాలు చేపడతారు. గతంలో కేవలం ఏడు కోట్ల మంది మాత్రమే బ్యాంకింగ్ రంగానికి దగ్గరగా ఉండేవారు. ప్రస్తుతం 52 కోట్ల మందికి సేవలు అందుతున్నాయి. దేశవ్యాప్తంగా 15 కోట్ల మందికి జలజీవన్ మిషన్ కింద మంచినీటి సరఫరా జరుగుతోంది. 12 కోట్ల మందికి మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాం'' అని పురందేశ్వరి తెలిపారు.

## సముద్ర మట్టానికి 12వేల అడుగుల ఎత్తులో కూచిపూడి నత్యం



**అనంతపురం:** అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. సముద్ర మట్టానికి 12వేల అడుగుల ఎత్తులో ఉన్న తుంగనాథ్ ఆలయం వద్ద మైనస్ మూడు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో కూచిపూడి నత్యం చేసి ఈ రికార్డు సాధించారు. 2024లో కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లో నత్య ప్రదర్శన చేసి.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించామని చిన్నారులు తెలిపారు. చిన్నారులతో కైలాస పర్వతంపై మరో నత్య ప్రదర్శన ఇప్పించడమే తమ తదుపరి లక్ష్యమని కూచిపూడి గురువులు ప్రవీణ్, వందన చెప్పారు.

## వణికిస్తున్న విమానాలు

### మూడు రోజుల్లోనే నాలుగైదు ఘటనలు

ఆందోళనల్లో ప్రయాణీకులు • డ్రీమ్‌లైనర్ విమానాలంటేనే భయపడే పరిస్థితి..



**హైదరాబాద్, జూన్ 16:** దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాలో వరుస ఘటనలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం గురించి మరో విమానంలో సాంకేతిక లోపం ప్రయాణికులను కలవరపాటుకు గురిచేసింది. హాంకాంగ్ నుంచి ఢిల్లీ వస్తోన్న ఎయిరిండియా విమానంలో ఈ సమస్యను గుర్తించడంతో దాన్ని వెనక్కి మళ్లించారు. ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్లైనర్ విమానం ఏఐ315 విమానం సోమవారం ఉదయం హాంకాంగ్ విమానాశ్రయం నుంచి బయల్దేరింది. మధ్యాహ్నం 12.20 గంటలకు

...మిగతా 2లో

# జనగణన ప్రక్రియ ప్రారంభం

- నోటిఫికేషన్ జారీ చేసిన హోంశాఖ
- స్వతంత్ర భారత్‌లో 8వ జనగణన ఇది
- ఈసారి కులగణన కూడా చేపట్టనున్నారు
- ఆరు నెలల ప్రక్రియ అంతా డిజిటలీకరణే..
- ప్రజలు సొంతంగానూ నమోదు చేసుకునే అవకాశం

2



## కొండపల్లి మున్సిపాలిటీ తెదేపా కైవసం

**కొండపల్లి:** ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఈ మేరకు అధికారులు ఫలితాన్ని ప్రకటించారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సభ్యుల సమావేశం జరిగింది. తెదేపా, వైకాపా కౌన్సిల్ సభ్యుల సమక్షంలో సీల్డ్ కవర్‌ను తెరిచారు. కోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్‌లో ఉన్న ప్రకారం ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, మొదటి వైస్ ఛైర్ పర్సన్‌గా కరిమికొండ శ్రీలక్ష్మి, రెండో ఛైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాసరావు ఎన్నికైనట్లు విజయవాడ ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి కావూరి చైతన్య ప్రకటించారు. అనంతరం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శ్రీహరికోటలోని షార్‌కు బాంబు బెదిరింపు

**శ్రీహరికోట:** తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)కు బాంబు బెదిరింపు వచ్చింది. షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ తమిళనాడు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఆదివారం అర్ధరాత్రి ఫోన్ కాల్స్ వచ్చాయి. బాంబు బెదిరింపు దష్ట్యా శ్రీహరికోటలో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. సోమవారం తెల్లవారుజాము నుంచి షార్ పరిసరాల్లో అణువణువూ తనిఖీలు కొనసాగిస్తున్నారు. సీఐఎస్ఎఫ్ బందాలు, పోలీసులు బలగాలు పాల్గొన్నాయి. సముద్ర మార్గాల్లోనూ తీరప్రాంత రక్షణ దళాలు తనిఖీలు చేపట్టాయి. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు పాల్గొన్నారు. తనిఖీల అనంతరం బెదిరింపు ఫోన్‌కాల్ ఆకతాయిలు చేసిన పనిగా భద్రతా బలగాలు తేల్చాయి.

## పేర్నినానికి అరెస్ట్ వారెంట్ జారీ



**మచిలీపట్నం:** మాజీ మంత్రి, వైకాపా నేత పేర్ని నానికి అరెస్టు వారెంట్ జారీ అయింది. 2019లో తెదేపా కార్యకర్త చందు శ్రీహర్షపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పేర్ని నాని సాక్షిగా ఉన్నారు. వరుసగా వాయిదాలకు కోర్టులో హాజరు కాకపోవడంతో ఆయనకు మచిలీపట్నం కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆయన్ని కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం కేసు విచారణను సెప్టెంబర్ 19కి వాయిదా వేసింది.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం..

మూడునాలుగు రోజుల నుంచి ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న పరస్పర దాడులు అణుకేంద్రాలపై దాడి చేసుకునే దాకా వచ్చాయి. ఇజ్రాయెల్ ఇరాన్ అణుకేంద్రంపై దాడి చేయడంతో పాటు ఆ దేశానికి చెందిన అణుశాస్త్రవేత్తలనందరినీ హతం చేసినట్టు సమాచారం. మరో పక్క ఇజ్రాయెల్ మామీద అణు దాడి జరిపితే మా దేశం ఖతం కావొచ్చు.. కానీ, మా బదులు ఇజ్రాయెల్ పైన న్యూక్లియర్ బాంబు వేసి ఆదేశాన్ని భూస్థాపితం చేస్తామని పాకిస్తాన్ మాకు బదులిచ్చిందంటూ ఇరాన్ మంత్రి ఒకరు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన పరిణామాల స్థూల విషయం..


**బంకర్లోకి ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ..!**



ఇరాన్ సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడులతో టెహ్రాన్లోని పలు కీలక ప్రాంతాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలోనే ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ని అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ఈశాన్య టెహ్రాన్లోని అండర్గ్రౌండ్ బంకర్లో ఖమేనీ కుటుంబంతో కలిసి తలదాచుకున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

**ఇరాన్ ట్రంప్‌ను హత్య చేయడానికి ప్రయత్నిస్తుంది..**





ఇదిలాఉండగా.. ఈ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' తొలిరోజే ఖమేనీని లక్ష్యంగా చేసుకోవాలని ఇజ్రాయెల్ తొలుత భావించినట్లు తెలుస్తోంది. కానీ, అణుశుద్ధి కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసుకునేలా ఇరాన్ కు మరో అవకాశం ఇవ్వాలని నెతన్యాహు సర్కారు యోచించినట్లు సమాచారం. అందుకే, కేవలం హెచ్చరికగా మాత్రమే ఖమేనీ నివాసం సమీపంలో దాడులు చేసినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

**అమెరికా దౌత్య కార్యాలయంపై ఇరాన్ క్షిపణి**

ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి సోమవారం టెల్‌అవీవ్‌లోని అమెరికా దౌత్యకార్యాలయంపై పడింది. అయితే, ప్రాణ నష్టం జరగలేదు.

...మిగతా 2లో

## మమ్మల్ని తీస్కపోండి ప్లీజ్

### ఇరాన్‌లోని భారతీయ విద్యార్థుల వేడుకోలు



**టెహ్రాన్, జూన్ 16:** ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ఇరాన్ దద్దరిల్లుతోంది. దీంతో అక్కడ చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని.. వీలైనంత త్వరగా తమను స్వదేశానికి తీసుకెళ్లాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. టెహ్రాన్లోని షాహిద్ యూనివర్సిటీలోనే దాదాపు 350 మంది భారతీయ విద్యార్థులున్నారు. 'దాడుల నేపథ్యంలో భారత ఎంబసీ మాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. కానీ, మేం చాలా భయపడుతున్నాం. స్వదేశానికి తిరిగి రావాలనుకుంటున్నాం.

...మిగతా 2లో

# యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సరికొత్త రికార్డ్ సృష్టించ బోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బీచ్ రోడ్ నుంచి రుషికొండ వరకూ ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో అధికారులను అడిగి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీఎంకు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్, ఐపీఎస్ అధికారులు వివరించారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో మంత్రుల కమిటీ, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్ యూనిట్‌గా సిబ్బంది పర్యవేక్షణపై ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఇతర సిబ్బందిని నియమిస్తే జవాబుదారీ ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.సెక్రటేరియట్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి యోగా కార్యక్రమం ఎక్కేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిరంతర శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. దాదాపు 3.4 లక్షల మంది ఒకే చోట యోగా చేయడానికి ఏర్పాట్లు చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖలో ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక్కచోటే మూడు లక్షల మందితో యోగా చేసేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఏపీవ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా డేలో పాల్గొంటారని చెప్పారు. యోగా డేలో నేవీ 11 యుద్ధ నౌకలను ప్రదర్శిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఒక చారిత్రక కార్యక్రమానికి విశాఖపట్నం వేదిక అవుతోందని అన్నారు. 11ఏళ్ల యోగా డేకు విశాఖ అనువైన ప్రదేశమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ప్రశాంతతకు, పాజిటివ్ యాటిట్యూడ్‌కు నిలయం విశాఖపట్నం. ఇక్కడి ప్రజలకు ఒక పిలుపునిస్తే దాన్ని పాటిస్తారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు. విశాఖపట్నం యోగాకు అనువైన ప్రదేశం. యోగ అందరి జీవితాల్లో భాగం కావాలి. ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు యోగా ద్వారా తగ్గుతాయి. యోగా అనేది వారసత్వ సంపద.. ప్రజల భవిష్యత్తు కోసం చేస్తున్న పెద్ద ఈవెంట్ ఇది. అందరూ అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతున్నాం. యోగా ప్రివెంటివ్ హెల్త్‌కి బాగా ఉపయోగపడుతుంది. యోగా ద్వారా మన కోసం మనం సమయం కేటాయించాలి. యోగాకి చదువు అక్కరలేదు కామన్‌సెన్స్ ఉంటే సరిపోతుంది. హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీ కోసం పనిచేస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగా ఎక్కువగా ప్రమోట్ చేస్తున్నారు.ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. 'విశాఖపట్నం ఒక ప్రాంతంలోని 3.5 లక్షల మంది.. విశాఖ అంతట కలిపి 5 లక్షల మంది పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది పాల్గొంటున్నారు. యోగా ద్వారా గిన్నిస్ రికార్డుతో పాటుగా సుమారుగా 22 రికార్డులు నమోదు చేయబోతున్నాం. వర్షం వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశాం. ప్రస్తుతం వర్షం వచ్చేందుకు ఆస్కారం లేదు.సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగా చేయాలని ఆలోచన చేస్తున్నానీ. సమర్థవంతంగా, నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమం తదనంతరం కూడా యోగాని కొనసాగిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అంతకుముందు విశాఖ చేరుకున్న సీఎం చంద్రబాబుకు పలువురు రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, డోలా బాలవీరాంజనేయస్వామి, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

# జనగణన ప్రక్రియ ప్రారంభం

ఢిల్లీ, జూన్ 16ః దేశంలో చేపట్టనున్న జన గణన నిర్వహణకు సంబంధించిన కేంద్ర హోంమం త్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైనట్ల య్యింది. రెండు దశల్లో సేకరించనున్న జనాభా లెక్కల కార్యక్రమం 2026 అక్టోబర్ 1న ప్రారంభమై 2027 మార్చి 1వ తేదీ నాటికి పూర్తవుతుంది.

'జమ్మూకశ్మీర్, లడ్డాఖ్ తో సహా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నాం. దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటిలో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కను పూర్తి చేయనున్నాం' అని హోంమంత్రిత్వ శాఖ ఆ ప్రకటనలో వెల్లడించింది. జనాభా లెక్కలు ఆరంభమైననాటి నుంచి చూస్తే భారత దేశంలో ఇది 16వ జనగణన. కాగా, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన.

**కులగణన కూడా..**

ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేపట్టారు. 2021లో ఈ జనగణన జరగాల్సి ఉంది. ఈ మేరకు 2019లో విడుదలైన నోటిఫికేషన్‌లో 2020లో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ పెరగడంతో కుల గణనను కూడా కేంద్రం చేపడుతోంది. 15 ఏళ్ల తర్వాత జనగణన జరగబోతోంది

**సర్వం డిజిటలీకరణే..**

ఆరు నెలలపాటు జరిగే ఈ లెక్కింపు ప్రక్రియను 34 లక్షల మంది గణకులు, సూపర్వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది నిర్వహిస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది.

**ప్రజలే సొంతంగానూ నమోదు చేసుకోవచ్చు..**

ప్రభుత్వం సూచించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదు చేసే వెసులుబాటునూ కల్పించారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు హోం మంత్రిత్వ శాఖ ఆ గెజిట్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

## మమ్మల్ని తీసుకెళ్లండి ప్లీజ్

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారకముందే మమ్మల్ని తరలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఆ వైద్య విద్యార్థి అభ్యర్థించాడు.

**సురక్షిత ప్రాంతాలకు తరలించినం..**

ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ''ఇరాన్లో ఉద్రిక్త పరిస్థితిని టెహ్రాన్లో భారత ఎంబసీ నిరంతరం గమనిస్తోంది. అక్కడి భారతీయ విద్యార్థుల భద్రత కోసం చర్యలు తీసుకుంటోంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కొంతమంది విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలించింది. మిగతా వారి పరిస్థితిని కూడా ఎంబసీ అధికారులు పరిశీలిస్తున్నారు. కమ్యూనిటీ నాయకులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం'' అని విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

# ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

**ఇరానియన్లు మూల్యం చెల్లిస్తారు..**

తమ పౌరులపై ఇరాన్ చేస్తున్న దాడులకు టెహ్రాన్ నగర ప్రజలు మూల్యం చెల్లించుకొంటారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఖట్జ్ ప్రకటించారు. గత రాత్రి ఆ దేశం చేసిన దాడిలో ఐదుగురు మరణించగా.. డజన్ల కొద్దీ పౌరులు గాయపడ్డారన్నారు. ఈసందర్భంగా ఇరాన్ సుప్రీంనేత ఖమేనీని ఉద్దేశించి ఖట్జ్ తన టెలిగ్రామ్ ఛానెల్లో ఓ పోస్టు పెట్టారు. '' గర్వం నిండిన ఆ నియంత ఇప్పుడు హంతకుడిలా మారాడు. ఉద్దేశపూర్వకంగానే మా సైన్యాన్ని భయపెట్టి ఆపరేషన్ను నిలిపివేయించాలనే ఉద్దేశంతో మా పౌరుల గృహాలను లక్ష్యంగా చేసుకొంటున్నాడు. టెహ్రాన్వాసులు దీనికి అతిత్వరలోనే మూల్యం చెల్లిస్తారు'' అని హెచ్చరించారు. ఇరాన్ ఆయుధ తయారీ కర్మాగారాల సమీపంలో నివసించే పౌరులు వెంటనే ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ 'ఎక్స్'లో పేర్కొంది.

**కొనసాగుతున్న దాడులు..**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. టెల్‌అవీవ్ ఫైటర్ జెట్లు ఇరాన్ ఐఆర్జీసీకి చెందిన ఖుద్స్ ఫోర్స్ హెడ్క్వార్టర్ను లక్ష్యంగా చేసుకొన్నాయి. ఇజ్రాయెల్కు వ్యతిరేకంగా ఈ దళం ఎన్నో కోవర్ట్ ఆపరేషన్లు నిర్వహించిందని ఐడీఎఫ్ ప్రతినిధి వెల్లడించారు.

**మా బదులు పాక్ ప్రతిదాడి చేస్తుంది..**

ఇజ్రాయెల్ తమపై అణుబాంబును ప్రయోగిస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగి దానిపై న్యూక్లియర్ అటాక్ చేస్తుందని ఇరాన్ కు చెందిన ఐఆర్జీసీ జనరల్ మొహసిన్ రెజాయి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ప్రభుత్వం అధీనంలోని టెలివిజన్ ఛానెల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. ''ఇజ్రాయెల్ మాపై అణు దాడి చేస్తే.. ఇస్లామాబాద్ కూడా ఇజ్రాయెల్ పై అణుబాంబును ప్రయోగిస్తుందని పాక్ నుంచి హామీ లభించింది'' అని మొహసిన్ వెల్లడించారు. ఆయన ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్లో సభ్యుడు కూడా. ప్రపంచంలో ప్రస్తుతం అణ్వాయుధాలున్న దేశాల్లో ఇజ్రాయెల్, పాకిస్థాన్ స్థానం దక్కించుకొన్నాయి.

**ఎన్పీటీ నుంచి వైదొలగుతాం..**

ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన దశలో.. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్పీటీ) నుంచి వైదొలగేందుకు తాము సిద్ధమవుతున్నామని ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిలీ బాఘై సోమవారం వెల్లడించారు. తమ పార్లమెంట్ ఈ మేరకు బిల్లును సిద్ధం చేస్తోందన్నారు. సామూహిక జనహనన ఆయుధాల తయారీని తమ దేశం ఎప్పుడూ వ్యతిరేకిస్తుందన్నారు. ఇక ఆ దేశం అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నుంచి వైదొలగే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇరాన్ 1950ల్లో నాటి రాజు షా రెజా పలావీ నేతృత్వంలో అణు కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. దీనికి అమెరికా సాయం చేసింది. 1958లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థలో సభ్యత్వం పొందింది.

**అందుకే మెరుపు దాడి..**

ఇరాన్ న్యూక్లియర్ బాంబుకు సంబంధించిన డిజైన్ ప్రాసెస్కు సంబంధించి అత్యంత కీలక ప్రయోగం చేసిందనే గోల్డెన్ ఇన్ఫర్మేషన్ వేగుల నుంచి టెల్‌అవీవ్ నాయకత్వానికి చేరింది. దీంతో టెహ్రాన్ తలుచుకొంటే కొన్ని వారాల్లో అణుబాంబును రూపొందించగలదని నిర్ధరణకు వచ్చింది. ఇక ఏమాత్రం ఉపేక్షించినా తమ అస్తిత్వానికి ముప్పు వాటిల్లుతుందని ఇజ్రాయెల్ ముందస్తు దాడులకు దిగిందని ''టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్'' కథనంలో పేర్కొంది. ఈక్రమంలో ఇజ్రాయెల్ తొలిదాడిలోనే అనుభవజ్ఞులైన ఇరాన్ అణు శాస్త్రవేత్తలను అంతం చేసింది. వీరంతా అణ్వాయుధాలకు సంబంధించి ఏళ్లతరబడి పరిశోధనలు చేసి విజ్ఞానం సంపాదించినవారు. వీరి కదలికలను ఇజ్రాయెల్కు చెందిన డజన్లకొద్దీ ఇంటెలిజెన్స్ రీసెర్చర్లు ఏళ్లతరబడి గమనిస్తున్నారు.

# ఈపీఎఫ్ చందాదారులకు అలర్ట్

ఢిల్లీ, జూన్ 16 ః ప్రావిడెండ్ ఫండ్ కు సంబంధించిన సేవల విషయంలో థర్డ్ పార్టీ ఏజెంట్ల సాయం తీసుకోవద్దని ఈపీఎఫ్‌ఓ సూచించింది. కీలక వివరాలు వారికి చిక్కే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బదులుగా ఆన్లైన్ పోర్టల్లో సొంతంగానే ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించింది. చందాదారుల సౌకర్యార్థం సేవలను గతంతో పోలిస్తే సులభతరం చేశామని, వేగం, పారదర్శకత తీసుకొచ్చామని పేర్కొంది.అన్ని సేవలూ ఉచితంగా లభిస్తున్నప్పటికీ.. ఈ సేవల కోసం కొన్ని సైబర్ కేఫ్లు/ ఫిన్టెక్ కంపెనీలు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్లు కార్మిక శాఖ గుర్తించింది. చందాదారులు ఉచితంగా, సొంతంగా చేసుకోగలిగే వాటికే నగదును వసూలు చేస్తున్నారని ఓ ప్రకటనలో తెలిపింది. ఇలా థర్డ్ పార్టీ సేవలు వినియోగించుకోవడం వల్ల కీలకమైన ఆర్థిక సమాచారం వారికి బయటకు పొక్కే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈపీఎఫ్‌ఓకు అధీకృత సంస్థలేవీ లేవని స్పష్టంచేసింది. కాబట్టి చందాదారులు, యజమానులు, పెన్షనర్లు ఈపీఎఫ్‌ఓ సేవల కోసం ఈపీఎఫ్ పోర్టల్, ఉమాంగ్ యాప్ను వినియోగించుకోవాలని సూచించింది.




# ఇది యుద్ధాల శకం కాదు

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందన్నారు. సైప్రస్ ప్రభుత్వంతో రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో సహకారం గురించి చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇరుదేశాలమధ్య సాంస్కృతిక సంబంధాలను ఎలా బలోపేతం చేయాలనే విషయాలపైనా తాము మాట్లాడుకున్నామన్నారు. సైప్రస్ లో యోగా, ఆయుర్వేదం ప్రజాదరణ పొందుతుండడం ఆనందంగా ఉందని అన్నారు. వీలయినంత త్వరగా భారత్ ను సందర్శించాల్సిందిగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ను మోడీ ఆహ్వానించారు. భారతీయులకు సైప్రస్ మంచి పర్యాటక ప్రాంతమని..ఇరుదేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను తీసుకువచ్చేలా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

**మోడీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం**


ఈ పర్యటన సందర్భంగా సైప్రస్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'తో సత్కరించింది.

## సమస్యల పరిష్కారానికి చర్యలు



- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులకు ఆదేశం
- గ్రీవెన్స్ డేలో ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, జూన్ 16(మనం ప్రతినిధి): అనేక రకాల సమస్యలతో పోలీసులను ఆశ్రయిం చే బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవడమే గ్రీవెన్స్ డే ముఖ్య లక్ష్యమని జిల్లా ఎస్పీ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 18 మంది అర్జీదారులతో ఎస్పీ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.



## రవాణా శాఖ నిబంధనలు కచ్చితంగా పాటించాలి: సీఐ

పెద్దపల్లి, జూన్ 16(మనం ప్రతినిధి): వాహనదారులంతా రవాణా శాఖ నిబంధనలు కచ్చి తంగా పాటించాలని పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ తెలిపారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధ నలను తెలియజేసేందుకు పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో పాటు గాయత్రి పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసు కోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స లాంటి అంశాలను తెలియజేశారు.

# 8 గంటల పాటు విచారణ

## ఫార్ములా వన్ రేసింగ్ కేసులో కేటీఆర్‌ను ప్రశ్నించిన ఏసీబీ

హైదరాబాద్, మనం ప్రతినిధిః మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ క్రమంలో విచారణ సమయంలో కేటీఆర్ వెంట మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ రామచందర్ రావు కూడా ఉన్నారు. ఫార్ములా-ఈ కార్ కేసులో విచారణ అధికారులు, దాదాపు 8 గంటల పాటు కేటీఆర్‌ను విచారించారు. ఏసీబీ అడిగిన అన్ని ప్రశ్నలకు కేటీఆర్ చాల చాకచక్యంగా అతితూచి సమాదానం చెప్పినట్లు సమాచారం. విచారణలో బాగంగా ఏసీబీ అధికారులు.. కేటీఆర్‌ను తన ఫోన్ ఇవ్వాలని కోరారని.. అయితే, వారి ప్రశ్నకు సామాధానంగా స్పందించిన కేటీఆర్, తానూ ఫోన్ తీసుకురాలేదని చెప్పినట్లుగా సమాచారం. ఇలా ప్రశ్నల మీద ప్రశ్నలు తిప్పి తిప్పి వారేన్ని ప్రశ్నలు అడిగిన సరే? ఆయన మాత్రం.. అన్నింటికి చాల కూల్‌గా సమాధానం చెప్పారని తెలుస్తోంది. కేసు ఇనివేస్టిగేషన్‌లో బాగంగా అవసరమైతే మరోసారి విచారణకు రావాలని అధికారులు కేటీఆర్‌కు చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. కేటీఆర్ విచారణ వేళా.. కొందరు ఏసీబీ అధికారులు జన్‌వాడలోని ఆయన నివాసానికి కూడా వెళ్లి సోదాలు జరిపారని, అక్కడ ఏవో కొన్ని డాక్యుమెంట్లు (పత్రాలు)తీసుకెళ్లినట్లు సమాచారం. అంతకుముందు నందీనగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో సీనియర్ నేత హరీశ్ రావు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఫార్ములా వన్ విచారణకు సంబంధించి పలు అంశాలపై వారు చర్చించినట్లు సమాచారం. మరోవైపు, కేటీఆర్‌కు మద్దతు తెలిపేందుకు పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఆయన నివాసానికి తరలివచ్చారు. వీరిలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ బాల్క సుమన్, పటోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు



ఉన్నారు. అనంతరం తెలంగాణ భవన్ నుంచి నుంచి పార్టీ ముఖ్య నేతలతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లారు.

**కేటీఆర్.. సెల్‌ఫోన్ సీజ్‌కు టుసీబీ యత్నం.. తెలేదన్న కేటీఆర్..**

కేటీఆర్ విచారణ సందర్భంగా ఆయన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నించారు. అయితే, తాను ఈరోజు విచారణకు సెల్‌ఫోన్ తీసుకురాలేదని కేటీఆర్ అధికారులకు వెల్లడించారు. దీంతో, ఫార్ములా ఈ-రేసు నిర్వహణ సమయంలో ఉపయోగించిన సెల్‌ఫోన్‌లను ఈ నెల 18 లోగా తమకు అప్పగించాలని ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆదేశించారు.

**8 గంటలు. 60 ప్రశ్నలు సంధించిన ఏసీబీ అధికారులు..**

దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ అధికారులు.. కేటీఆర్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఉదయం ప్రారంభమైన విచారణలో సుమారు 60 ప్రశ్నలను కేటీఆర్‌పై సంధించినట్లు సమాచారం. ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించడం ఇది రెండోసారి. ఎఫ్ఈవో (ఫార్ములా ఈ ఆపరేషన్స్) కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారని సమాచారం. ప్రధానంగా హెచ్ఎండీఏ నిధుల దుర్వినియోగం, రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం లేకుండా నిధులను ఎలా మళ్లించారన్న అంశాలపై ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఏసీబీ ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు చెప్పారు. హెచ్ఎండీఏ నిధులను ఎఫ్ఈవో సంస్థకు నిబంధనల ప్రకారమే పంపామని, ఈ వ్యవహారంలో తాను వ్యక్తిగతంగా ఎలాంటి లబ్ధి పొందలేదని ఆయన అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. అగ్రిమెంట్ల వ్యవహారమంతా అధికారులే చూసుకున్నారని, స్పాన్సర్లు చివరి నిమిషంలో వెనక్కి తగ్గడంతో హెచ్ఎండీఏ నిధులతో ఫీజులు చెల్లించాల్సి వచ్చిందని కేటీఆర్ వివరించినట్లుగా తెలుస్తోంది.

**విచారణ అనంతరం కేటీఆర్‌కు ఘన స్వాగతం..**

విచారణ అనంతరం ఏసీబీ కార్యాలయం నుంచి ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ''విచారణకు రమ్మని ఇప్పటికే మూడుసార్లు పిలిచారు.. ఇంకో 30 సార్లు పిలిచిన వస్తా. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గతంలో జైలుకు వెళ్లా.. ఇప్పుడు మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చినా భయపడను'' అంటూ వ్యాఖ్యానించారు.

**అన్నింటికీ తెగించే కొట్లాడుతున్నం..**

'నిజం నిలకడ మీద తెలుస్తుంది. చట్టాలు, న్యాయస్థానాలపై గౌరవం ఉంది. కాబట్టే ఏసీబీ విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వస్తామని చెప్పాం. విచారణకు పిలవడం ఇది మూడోసారి.

# వణికిస్తున్న విమానాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇది ఢిల్లీలో ల్యాండ్ అవ్వాల్సి ఉండగా.. మార్గమధ్యంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్ ఇన్ కమాండ్ గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పైలట్లు ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని వెనక్కి మళ్లించారు. అదృష్టవశాత్తూ ఈ విమానం హాంకాంగ్ ఎయిర్పోర్టులోనే సురక్షితంగా దిగింది. ప్రయాణికులందరినీ దించేసి విమానంలో అధికారులు తనిఖీలు చేపట్టారు.



**18 గంటల పరేషాన్..**

శని, ఆదివారాల్లో అదే సంస్థకు చెందిన ఎయిరిండియా ఎక్స్ప్రెస్ విమానాల్లో సమస్యలు తలెత్తి సహనాన్ని పరీక్షించాయి. ఈ రెండూ కోల్కతాకు వెళ్లాల్సినవే. గువాహటి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కోల్కతాకు 170 మంది ప్రయాణికులతో వెళ్లాల్సిన ఐఎక్స్-1226 విమానం శనివారం రాత్రి 9.20 గంటలకు బయల్దేరాలి. సాంకేతిక సమస్య పేరుతో అది ఆలస్యమైంది. సమస్య ఏమిటో, విమానం ఎప్పుడు బయల్దేరుతుందో తెలియక ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. దానిపై పలు వీడియోలు క్షణాల్లో చక్కర్లు కొట్టాయి. అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో వారిని విమానం దిగాలని చెప్పి ఒక హోటల్కు తరలించారు. ఆదివారం ఉదయం 9.30కి మళ్లీ విమానం ఎక్కించారు. అదే సాంకేతిక సమస్య వల్ల విమానం ఆలస్యమవుతోందని మరోసారి ప్రకటించారు. రెండోసారి కిందికి దించి, విమానాశ్రయంలోకి తరలించారు. వేరే విమానం ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. చివరకు అలా మరో విమానంలో సాయంత్రం 3.34 గంటలకు వారు బయల్దేరారు. కొందరు మాత్రం వేరే విమానాలను ఎంచుకున్నారు.

**రన్వేపైనే గంటసేపు నిరీక్షణ**

ఆదివారం ఉదయం 7 గంటలకు ఉత్తర్ప్రదేశ్లోని గాజియాబాద్ నుంచి బయల్దేరి 9.20కి కోల్కతాకు చేరాల్సిన ఎయిరిండియా ఎక్స్ప్రెస్ విమానం (ఐఎక్స్ 1511)లోనూ సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్కు ముందు దీనిని గుర్తించిన సంస్థ అప్రమత్తమై ప్రయాణాన్ని నిలిపివేసింది. లోపాన్ని సరిచేశాక మధ్యాహ్నం 2.09 గంటలకు ఇది బయల్దేరి సాయంత్రం 4.24 గంటలకు గమ్యాన్ని చేరుకుంది.

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు

పెద్దపల్లి/సుల్తానాబాద్, జూన్ 16(మనం ప్రతినిధి): గోదావరిఖనిలో పెద్దపల్లి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 15, 17 ఏండ్ల బాలుర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి గోల్ మెడల్, సిల్వర్ మెడల్ అందుకున్న సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు టి ధనుష్, బి.మణికంఠ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలియజేశారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసికంగా శారీరకంగా ఆరోగ్యకరంగా దృఢంగా తయారవుతారని, రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని, క్రీడలను ప్రోత్సహించడంలో ఐపీఎస్ పాఠశాల ముందుంటుందని అన్నారు.




# ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ వేళాలో కేంద్రమంత్రి

హైదరాబాద్, జూన్ 16(మనంన్యూస్)ః ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్షిప్ మేళ పీజీ లా కళాశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి జయంతి చౌదరి , రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్బాబు, ఎంపీలు ఆర్. కృష్ణయ్య, ఈటెల రాజేందర్లు హాజరయ్యారు. ఇందులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా సంస్థలు, ప్రభుత్వయేతర సంస్థలు 85 పాల్గొన్నారు. వీటిలో 3540 కాలిలకు గాను 3750 విద్యార్థిలు హజరు కాగా 2890 లో పరిశీలన ఉన్నారు. ఈ మేళ దిగ్విజయం చేయడానికి మా ఉద్యోగులందరూ వారి వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూశారు. ఇలాంటి ప్రధానమంత్రి అప్రెంటిషిప్ మేళ ప్రతి సంవత్సరంనిర్వహిస్తామని తెలుపుతూ విద్యార్థిని విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపరుస్తామని ప్రిన్సిపాల్ దోవ శైలజ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటిఐ మల్లెపల్లి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రాజా, ట్రైనింగ్ ఆఫీసర్లు ఎం బి కృష్ణ యాదవ్, మల్లేష్, శ్రీనివాస్,సోమ శ్రీనివాస్, బలమని సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





## శ్రీవారి సన్నిధిలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్

తిరుమల, జూన్ 16(మనం న్యూస్): తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వీరితో పాటు ఉదయం నైవేద్య విరామ సమయంలో ఏపీ మంత్రి అనగాని సత్య ప్రసాద్, టీజీ భరత్ దర్శనం చేసుకున్నారు వీరి ఇరువురికి టీటీడీ అదనపు ఈవో టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగ నాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వ చనం అందించగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించగా టీటీడీ క్యాలెండర్ స్వామి వారి పటాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అనంతరం ఆలయం వెలుపల కేంద్ర మంత్రి పియూస్ గోయల్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగిందని అద్భుతంగా ఉందని కొనియాడారు దేశ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేశం, సమాజం అభివృద్ధి చెందాలని శ్రీవారిని వేడుకున్నాను. వికాసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రప్రభుత్వం వేస్తున్న అడుగులు విజయం సాధించాలని, విశ్వగురువుగా భారతదేశం ఎదగాలని స్వామివారిని ప్రార్థించాను అన్నారు కేంద్ర మంత్రి పియూస్ గోయల్. కేంద్రం మంత్రి వెంట రాష్ట్ర మంత్రులు అనగాని సత్య ప్రసాద్, టీజే భరత్, టిటిడి బోర్డు మెంబర్లు పొరపాక లక్ష్మి భాను ప్రకాష్ రెడ్డి, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

## వెంకన్న సన్నిధిలో పలువురు సినీ ప్రముఖులు



తిరుమల, జూన్ 16(మనం న్యూస్): తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి విరామ సమయంలో సినీనటి, మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీ నటులు మీనా, ఇంద్రజ తదితరులు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితుల వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 8న సెప్టెంబర్ నెల దర్శన కోటా విడుదల



**తిరుమల, జూన్ 16(మనం న్యూస్):** సెప్టెంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను జూన్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జూన్ 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్లో టికెట్లు మంజూరవుతాయి.

### 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను జూన్ 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

### 21న వర్చువల్ సేవల కోటా విడుదల

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను జూన్ 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

### 23న అంగప్రదక్షిణం టోకెన్లు.

అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను జూన్ 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

### శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా..

శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను జూన్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

### వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను జూన్ 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

### 24న ప్రత్యేక ప్రవేశ దర్శన కోటా

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూన్ 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.

### గదుల కోటా విడుదల

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను జూన్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్లైన్లో విడుదల చేస్తారు.

### 25న ఆగస్టు నెల కోటా విడుదల

శ్రీవారి సేవ(తిరుమల మరియు తిరుపతి), పరకామణి సేవ, నవనీత సేవ, గ్రూప్ సూపర్వైజర్ల సేవల ఆగస్టు నెల కోటాను జూన్ 25న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు.

## దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మాది వెంకటేశ్వర్లు



**తుంగతుర్తి, జూన్ 16(మనం న్యూస్):** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ,రైతు ,ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మది వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడుతూ 11 ఏండ్ల బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అనేకసార్లు నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాల కోసం కాకుండా బడా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

# టీటీడీ ప్రతిష్ట పెంచేలా ఢిల్లీ ఎస్వీ కళాశాలకు రూపు

- బీఆర్ నాయుడు, టీటీడీ చైర్మన్
- శ్రీ వేంకటేశ్వర కళాశాల గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు ఎంపిక



తిరుపతి, జూన్ 16(మనం న్యూస్): టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా ఢిల్లీ శ్రీ వేంకటేశ్వర కళాశాలను రూపొందించాలని అధికారులను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. తిరుపతి శ్రీ పద్మావతీ అతిథి గృహంలో టిటిడి ఈవో జె. శ్యామలరావు, గవర్నంగ్ బాడీ సభ్యులతో సోమవారం 155వ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్వీ కళాశాల గవర్నింగ్ బాడీ ఛైర్మెన్ గా బీఆర్ నాయుడు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గవర్నింగ్ బాడీ ఛైర్మెన్ గా ఎంపికైన టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడును గవర్నింగ్ బాడీ సభ్యులు అభినందించారు. ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా టిటిడి నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర కళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాల పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు సూచించారు. ఎస్వీ కళాశాలలో తెలుగు విద్యార్థులకు అడ్మిషన్ల కోటాలో ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాది వైపున ఉన్నటిటిడి ఆలయాలలో, ఢిల్లీలోని ఎస్వీ కళాశాలకు ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా ఇంజనీరింగ్ ఈఈ విభాగాన్ని ఏర్పాటు చేయాలని టిటిడి ఈవో జె. శ్యామలరావుకు టిటిడి ఛైర్మెన్ సూచించారు. ఎస్వీ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు.

విద్యార్థులకు ఉపాధికి అవకాశం ఉన్న వృత్తిపరమైన కోర్సులను ప్రవేశ పెట్టాలని సూచించారు. కళాశాలలో పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంజనీరింగ్ మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కాలం చెల్లిన భవనాల స్థానంలో భవనాల పునర్మానం, ఆడిటోరియం మరమ్మతులు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీతో కళాశాల ప్రవేశంలో మరింత ఆకర్షణీయంగా ఉండేలా మార్పులు చేర్పులు చేపట్టాలన్నారు. కళాశాలకు సంబంధించిన పలు అంశాలను ప్రిన్సిపాల్ డా. వర్ఖుల రవి టిటిడి ఛైర్మెన్, ఈవోల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న గవర్నింగ్ బాడీ సమావేశం నాటికి కళాశాల అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలని అధికారులను ఛైర్మెన్ కోరారు.

ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు డా. పనబాక లక్ష్మీ, ఎస్.నరేష్ కుమార్, ఎండోమెంట్ కమీషనర్ కె. రామచంద్ర మోహన్, ఎఫ్.ఏ అండ్ సీఏవో ఓ.బాలాజీ, సీఈ టివి సత్యనారాయణ, టిటిడి డీఈవో వెంకట సునీల్, పలువురు గవర్నింగ్ బాడీ ప్రతినిధులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

## 22న తిరుపతి బీసీ గర్జనకు తరలిరండి



- డాక్టర్ అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీసీ గర్జన

బంగారు పాల్యం, జూన్ 16 (మనం న్యూస్): ఈనెల 22వ తేదీన తిరుపతి జిల్లాలో జరుగు బీసీ గర్జనకు చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి బీసీ నాయకులు భారీగా తరలిరావాలని చిత్తూరు జిల్లా బంగారు పాలెంలో సోమవారం మీడియా సమావేశంలో బీసీ నాయకులు పిలుపునిచ్చారు. 22వ తేదీ జరుగు బీసీ గర్జనకు బీసీలంతా ఐకమత్యంగా ఉండి వారి సమస్యలను పరిష్కార కోసం బీసీ గర్జన సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీసీ ఆత్మ గౌరవం భరోసా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి ఇందిరా మైదానంలో బీసీగా గర్జన సభను ఏర్పాటు చేసినట్లు, 22న మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని తెలిపారు. బీసీ అంటే కులము కాదు. బీసీ అంటే ఒక్కటే వర్గం. జనం మనం, బలం మనం, బీసీలు ఎస్సీలు ఎస్టీలు ఒక వర్గం కాదని అన్నారు. రాష్ట్రంలో బీసీ మంత్రులు, బీసీ ఎమ్మెల్యేలు, బీసీ నాయకులు, సామాజిక ఉద్యమ నాయకులను ఈ సందర్భంగా సన్మానాలు నిర్వహిస్తారు. బీసీల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక పథకాలు చేపట్టాలని అన్నారు. ఏపీ ఫౌండేషన్ తో కలసి ఆంధ్రప్రదేశ్లో బీసీ సంక్షేమ సంఘం మీ ముందుకు రావడం జరిగిందని అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలే అంతిమ నిర్ణేతలుగా ప్రభుత్వానికి నడపడం అంటే శాసన, కార్య నిర్వాహకులు, న్యాయం, రక్షణ, వ్యవస్థలైనప్పుడు, అదే శాసన కార్య నిర్వాహక, న్యాయ, రక్షణ, వ్యవస్థలు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రాజ్యాంగం హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి ఇందిరా మైదానంలో జరుగు బిసి ఆత్మగౌరవ భావన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఫౌండేషన్ చైర్మన్ మాజీ మంత్రి పరస రత్నం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కోనేటర్ ఆలయం ఆలెన్ రాజు, తిరుపతి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కొల్లూరు నాగరాజ్ గౌడ్, చిత్తూరు జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బుస నాగ రాజా గౌడు, గీత కార్పొరేషన్ డైరెక్టర్ కలిసేది నిర్దాసుల గౌడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వామి దాసు, మురళి, ఉమా శాంతి పాల్గొన్నారు.

## అలిపిరి హోమం వద్ద భక్తుల కష్టాలను నివారించండి



- టీటీడీ ఉద్యోగ, కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి

తిరుపతి, జూన్ 16(మనం న్యూస్): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అలిపిరి గోశాల వద్ద నిర్వహిస్తున్న హోమశాల వద్ద ప్రతిరోజు భక్తులు తీవ్రస్థాయిలో కష్టాలు పడుతూ, మనోవేదనకు గురవుతున్నారని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఆరోపించారు. హోమం టికెట్ల కేటాయింపు, నిర్వహణలో పారదర్శకత లోపించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని, అక్రమాలను నివారించి, టికెట్లను, సౌకర్యాలను పెంచడం ద్వారా సమస్యను అధిగమించడానికి టిటిడి యాజమాన్యం కృషి చేయాలని ఆయన సూచించారు. సోమవారం నాటి ఉదయం అలిపిరి వద్ద భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని కందారపు మురళి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దేశమంతటా టీటీడీ నిధులను ఖర్చు చేస్తున్న యాజమాన్యం అలిపిరి వద్ద హోమ నిర్వహణకు, ఒకేసారి వేల మంది దంపతులు పాల్గొనటానికి అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి అవకాశం ఉన్నా, గతంలో కొందరు దాతలు నిధులు కేటాయించినా... ఆ పనులపై శ్రద్ధ పెట్టకపోవడం సమంజసం కాదని అన్నారు. భక్తులు ప్రతిరోజు ఉదయం 3 గంటల నుంచి హోమశాల వద్ద పడిగాపులు కాస్తున్నారని పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ 50 టికెట్ల కోసం వందలు, వేల సంఖ్యలో భక్తులు అర్ధరాత్రి నుంచి గంటల తరబడి ఎదురు చూడటం ఎంతవరకు సమంజసం? అని ఆయన ప్రశ్నించారు. ఆన్ లైన్లో 150 టికెట్లు, ఆఫ్లైన్లో 50 టికెట్లు కేటాయిస్తున్నా రని, హోమంలో పాల్గొనే వారికి దర్శనం అనుమతిస్తుండటం వల్ల దర్శనం దొరకని వారు పెద్ద ఎత్తున ఇక్కడికి చేరుతున్నారని తెలిపారు.

ప్రతిరోజు పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది సిఫార్సులకు సగం టిక్కెట్లు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు. హోమంలో పాల్గొనే భక్తులకు సరైన సౌకర్యాలు లేవని, కొబ్బరి కీతులతో హోమశాలను నిర్వహిస్తున్నారని వర్షాల సమయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. భద్రతాపరమైన చర్యలు చేపట్టి హోమశాలను పటిష్టంగా నిర్మాణం చేయాలని గోశాల వెనుక ఉన్న స్థలంలో లేదా అరిపిరిలోని మరోచోట విస్తృతి పెంచాలని కందారపు మురళి సూచించారు. టిటిడి పెద్దలు సామాన్య భక్తులు ఎదుర్కొనే సమస్యలపై కేంద్రీకరణ చేస్తే సమంజసంగా ఉంటుందని అన్నారు.

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి



**చేవెళ్ల, జూన్ 16(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం తాత్సారం వీడి వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి అధ్యక్షతన ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మధ్య భారతదేశంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారన్నారు.కేంద్రం స్పందించకుండా దాడులను మరింత పెంచి సామాన్యులను సైతం చంపేస్తోందని, కాల్పుల విరమణ స్థితిలో ఉన్నవాళ్లను చుట్టుముట్టి చంపడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభు లింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల,లలిత, శ్రీకాంత్, పెంటయ్య, నర్సింలు, యాదయ్య ,రాములు రైతులు పాల్గొన్నారు.

# మీ సేవ సెంటర్ల నిలువు దోపిడీ

- ఈసీ (ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్) సర్వీస్ ఛార్జెస్ తో కలిపి రూ.535 ఉండగా 1000 పైగా వసూలు
- మీ సేవ కేంద్రాల నిర్వహణపై... నిఘా శూన్యం




**మిర్యాలగూడ, జూన్ 16(మనం న్యూస్):** సులభంగా... వేగంగా సర్టిఫికెట్లను అందించడమే లక్ష్యంగా ప్రారంభమైన మీసేవ సెంటర్లు దోపిడీకి కేంద్రాలుగా మారాయి. మీసేవ సెంటర్ల నిర్వహణపై నిఘా లేకపోవడంతో... ఇష్టా రాజ్యాంగ సర్వీస్ ఫీజులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజీవ్ వికాస్ అప్లికేషన్ల సమయంలో... అవసరం పడిన సర్టిఫికెట్ల జారీ సంబంధిత అధికారుల ధ్రువీకరణ లేకుండానే... మీసేవ సెంటర్ల నిర్వాహకులు రూ. 300 నుంచి 400 తీసుకొని ఇన్కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మీసేవ సెంటర్లలో రెవెన్యూ సేవలకు ఘనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మీసేవ సెంటర్ల నిర్వాహకులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండానే ఇష్ట రాజ్యాంగ సర్టిఫికెట్లు జారీకి భారీగా నగదు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం సర్వీస్ చార్జెస్‌ను తీసుకోవాల్సిన మీ సేవ సెంటర్ల నిర్వాహకులు అడ్డగోలుగా వసూళ్లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇన్ కం, రెసిడెన్స్, క్యాస్ట్, ఈసీ సహా పలు రకాల సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ మీ సేవ కేంద్రాల నుంచి జరుగుతోందన్నది తెలిసిందే. భూములు ప్రొహిబిషన్ లిస్టులో పడటంతో పాటు ఉన్న భూమికన్న తక్కువ నమోదు కావటం, ల్యాండ్ ఎవరి పేరు మీద ఉన్నది అన్న విషయం క్లారిటీ తెలుసుకునేందుకు ఈసీ తప్పనిసరి. అయితే ఇదే అదునుగా నల్గొండ జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ, నియోజకవర్గ కేంద్రాల్లో మీసేవ సెంటర్లు వినియోగదారులను నిలువునా దోపిడీ చేస్తున్నాయి. ఈసీ ఫీజు సర్వీస్ ఛార్జెస్ తో కలుపుకొని రూ. 535 తీసుకోవాల్సి ఉండగా రూ. 1000 కి పైగా తీసుకుంటున్నట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. 30 ఏళ్ల వరకు ఈసీ చార్జెస్ ఓ విధంగా ఉండగా... 30 ఏళ్లు దాటితే మరో విధంగా ఈసీ చార్జెస్ ఉండగా ... అంతకు రెట్టింపు వసూలు చేస్తూ ఇదేమిటని ప్రశ్నించిన వారికి... నాలెడ్జ్ లేదు... మీరు అప్డేట్ కావాలంటూ మీసేవ కేంద్రాలు దోపిడీకి తెర తీస్తున్నాయి. మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన అలిజెర్ల సైదులు దేవరకొండ పరిధిలో తమకు ఉన్న భూమి 22 గుంటలు కాగా... ప్రస్తుత రికార్డుల్లో తక్కువగా ఉందని గుర్తించి... అక్కడి రెవెన్యూ ఆఫీసులో అప్లికేషన్ పెట్టేందుకు ముందుగా దేవరకొండ లోని మీసేవ కేంద్రానికి వెళ్లి ఈసీ తీపించారు. అయితే దేవరకొండలోని ఓ మీసేవ సెంటర్ నిర్వాహకులు అతని నుంచి ఈసీ చార్జెస్ రూ. 1035 తీసుకున్నారు. ఈసీ చార్జెస్ ఎక్కువ తీసుకున్నారని గుర్తించిన సైదులు... అదే ప్రాంతంలోని మరో మీ సేవకు వెళ్లి అడుగగా రూ. 570 వరకు ఉంటుందని తెలిపారు. అయితే ఈసీ ఇచ్చిన మీసేవ సెంటర్ వద్దకు వెళ్లి తాము చెల్లించిన రూ. 1035 కు రిసిప్ట్ ఇవ్వాలని కోరినప్పటికీ... మేము ఈసీకి ఎటువంటి రసీదు ఇవ్వమ ని... సమాధానం ఇవ్వటం గమనార్హం. వాస్తవంగా ఈసీ చార్జెస్ 1035 చెల్లించాల, వాస్తవం ఏమిటి అన్నది పలు మీ సేవ నిర్వాహకులను బాధితుడు అడుగగా రూ. 600, 570 ఇలా తీసుకుంటారని చెప్పారు. ఇదే విషయమై జిల్లా మీసేవ సెంటర్స్ మేనేజర్ దుర్గారావు ను వివరణ కోరగా ఆన్ లైన్ లో జనరేట్ చేసిన విధంగా మీసేవ చార్జెస్ చెల్లించాలని చెప్పారు. కొంతమంది మీ సేవ సెంటర్ నిర్వాహకులు ఈసీకి రూ. 550 నుంచి 600 చెల్లిస్తే సరిపోతుందని చెబుతున్నప్పటికీ మీసేవ జిల్లా మేనేజర్ కు బాధితుడు ఫోన్ చేయగా ఆన్ లైన్ లో మీకు జనరేట్ అయిన రూ. 1035 చెల్లించాలని చెప్పటం గమనార్హం. మరి కొందరు ఇష్టం ఉన్నట్లు ఈసీ చార్జెస్ సహా ఇతర సేవలకు ఇష్టరాజ్యాంగా డబ్బులు వసూలు చేస్తున్నారని బాధిత ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవ నిబంధనలను ఉల్లంఘించి వసూలు చేస్తున్న కార్యాలయాలకే పరిమితమై... మీసేవ సెంటర్ల నిర్వాహకులకే జిల్లా మేనేజర్ వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా మీసేవ సెంటర్ల దోపిడిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరు తల్లి పేరుతో మొక్క నాటాలి

- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం

**చేవెళ్ల, జూన్ 16(మనం న్యూస్):** ప్రతి ఒక్కరు తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ వార్డులో తల్లి పేరుతో మొక్కల నాటు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం స్థానిక భాజపా నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.



## దాటుకోవడం అలవాటు చేసుకో

ఎప్పుడో ఒకసారి దాటుకోవాల్సిందే
గతం నుండి వర్తమానంలోకి,
వర్తమానం నుండి భవిష్యత్తులోకి
బాధగానో, జ్ఞాపకంగానో,
చిల్లులుపడిన దేహంతోనో,
ఎవరో పుకిలించి వేసిన నీటిగానో,
అకారణంగా నిందింపబడిన మనసుతోనో,
గర్భం నుండి విసిరేయబడిన రక్తపు ముద్దగానో,
అన్నీ ఉన్నా
ఏది లేనివాడిలా దాటుకోవడం
ఒక అనివార్య చర్య
ఎప్పుడో పాచిపోయిన
మూటలను విప్పుకోవడం,
మనసుల్లో కంపుగొట్టే భావాలను
బహిరంగపరుచుకోవడం,
కొత్త ఆకులు చిగురించే చోట
పండుటాకుల గాయాలపై గొడ్డుకారం
చల్లుకోవడం,
చల్లని సాయంత్రానికి వికృతమైన రూపాన్ని
దిద్దుకోవడం,
వెలుగు కోసమో,
వెలుగులాంటి మాట దొరకని చోట ఉండటం
కంటే
దాటుకోవడం ఉన్నతమైనదే.
ఎప్పుడో తెలిసిన వాస్తవాల మూలాలు
వెతుక్కోవడం
చుక్కలు రాలుతున్నప్పుడు
కంట్లో బురదనో, బురదలాంటి నిజాలనో,
ఎవరి అభద్రతలను వారు కక్కుకోవడం కంటే
అడుగులు కొత్త దారులను అన్వేషించుకోవడమే
మంచిది
ఎవరి శవ యాత్రకు వారే
తెల్లని గుడ్డను సిద్ధపరచుకోవాలి
ఎవరి జాగాలను వారే
తవ్వుకొని శాశ్వత గృహాన్ని నిర్మించుకోవాలి.
బంధాలన్నీ తోకచుక్కల్లా జారిపోయిన చోట
ఎవరి నావను వారే నడుపుకుంటూ
ఈ వైపు నుండి ఆ వైపుకు
బ్రతికున్న శవంలా తరలిపోవాలి
ఎవరూ,
దేనికీ,
అతీతులు కాదు
కాలానికి లొంగని అక్షరం ఉన్నదా!?

**- జాని తక్కెడశిల**

# భారతీయ యువతకు స్ఫూర్తి సతీష్ రెడ్డి





ఇటీవల కేంద్ర ప్రభుత్వం డాక్టర్ జి. సతీష్ రెడ్డిని జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడిగా నియమించింది. ఇది తెలుగు ప్రజలకు గర్వకారణం. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవ సలహాదారుగా (ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) క్యాబినెట్ హోదాతో నియమించింది. గత 40 సంవత్సరాలుగా డాక్టర్ సతీష్ రెడ్డి భారత రక్షణ రంగంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. మాజీ అధ్యక్షుడు భారతరత్న డాక్టర్ డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కె.కలాం మరియు ప్రసిద్ధ సాంకేతిక నిపుణుడు పద్మభూషణ్ డాక్టర్ వికె సారావత్ తర్వాత, డాక్టర్ సతీష్ రెడ్డి భారతదేశంలో రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. భారతదేశ యువత డాక్టర్ సతీష్ రెడ్డిని తమ కెరీర్ కోసం స్ఫూర్తిగా తీసుకోవాలి. డాక్టర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలోని మహిమలూరు గ్రామంలో జన్మించారు. అనంతపురంలోని జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం నుండి ఎలక్ట్రానిక్స్ ,కమ్యూనికేషన్ ఇంజనీరింగ్లో పట్టభద్రుడయ్యాడు. హైదరాబాద్లోని జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం నుండి నావిగేషన్ స్పెషలైజేషన్లో ఎంఎస్ పిహెచ్డి పొందారు.

22 సంవత్సరాల అతి చిన్న వయసులోనే సతీష్ రెడ్డి గారు 1985లో హైదరాబాద్లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లాబొరేటరీలో చేరారు, ఆ తర్వాత రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (RCI) లో చేరారు. RCIలో డైరెక్టర్గా, ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్స్ మాడ్యూల్స్, ఇతర వినూత్న వ్యవస్థల అభివృద్ధికి నాయకత్వం వహించాడు. మొదట నావిగేషన్ సైంటిస్ట్, సిస్టమ్ మేనేజర్గా, సెప్టెంబర్ 2014లో విశిష్ట శాస్త్రవేత్తగా పనిచేశారు. మే 2015లో రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారుగా నియమితులయ్యారు. 2018 నుండి 2022 వరకు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ పదమూడవ ఛైర్మన్గా పనిచేసి భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తగా పదోన్నతి పొందారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ పాలకమండలి ఛైర్మన్గా పనిచేశారు. భారత రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారుగా ఉన్నారు.

ఇంకా క్షిపణులు మరియు వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్గా, ఆయన ఇండియన్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ కార్యక్రమం, నాగ్, క్విక్ రియాక్షన్ సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి, రుద్రం, లాంగ్ రేంజ్ గైడెడ్ బాంబ్ మొదలైన క్షిపణి వ్యవస్థల అభివృద్ధిని పర్యవేక్షించారు. భారతదేశం యొక్క మొట్టమొదటి విజయవంతమైన పృథ్వీ డిఫెన్స్ వెహికల్ మార్క్ 2 యాంటీ-శాటిలైట్ క్షిపణి (మిషన్ శక్తి) పరీక్షను కూడా ఆయన పర్యవేక్షించారు. ప్రపంచంలోనే అతి పొడవైన శ్రేణి తుపాకీ ది అడ్వాన్స్డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్, యాంటీ-రేడియేషన్ క్షిపణులు, స్మార్ట్ ఎయిర్ ఫీల్ ఆయుధాలు, స్మార్ట్ బాంబులు మరియు క్షిపణి సహాయక టార్పెడో విడుదల వ్యవస్థల అభివృద్ధిలో ఆయన పాల్గొన్నారు. నావిగేషన్ సైన్స్లో అసాధారణ నైపుణ్యానికి పేరుగాంచిన సతీష్ రెడ్డి గారు , భారతదేశ క్షిపణి వ్యవస్థల కోసం అనేక సాంకేతిక పరిణామాలకు మార్గదర్శకుడిగా పేరుగాంచారు. భారతదేశపు మొట్టమొదటి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి మిషన్ అయిన అగ్ని యొక్క విజయవంతమైన విమాన పరీక్షకు ఆయన గణనీయమైన కృషి చేశారు. 'భారతదేశ క్షిపణి కేంద్రం' అయిన డాక్టర్ అబ్దుల్ కలాం క్షిపణి సముదాయానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. క్షిపణి సముదాయం యొక్క కీలక ప్రయోగశాల , క్షిపణులు ఇతర అనువర్తనాల కోసం ఏవియానిక్స్ వ్యవస్థల అభివృద్ధి మరియు పంపిణీని పర్యవేక్షించే అధునాతన డిజైన్ కేంద్రమైన ఇమారత్ పరిశోధనా కేంద్రం యొక్క ప్రోగ్రామ్ డైరెక్టర్గా కూడా ఆయన పనిచేస్తున్నారు. ఆయన నాయకత్వంలోనే మీడియం-రేంజ్ ఉపరితలం నుండి గాలికి క్షిపణి కార్యక్రమం అభివృద్ధి మొదటి మూడు వరుస మిషన్లలో హ్యాట్రిక్ సాధించడం విజయవంతంగా సాధించబడింది. డాక్టర్ డాక్టర్ సతీష్ రెడ్డి గారు తన సేవలకు అనేక అవార్డులను అందుకున్నారు. రెడ్డి గారు లండన్లోని రాయల్ ఏరోనాటికల్ సొసైటీ ఫెలోగా ఎన్నికయ్యారు. అమెరికన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ మిస్సైల్ సిస్టమ్స్ అవార్డు, ఏరోనాటికల్ ప్రైజ్, నేషనల్ సిస్టమ్స్ గోల్డ్ మెడల్, నేషనల్ డిజైన్ అవార్డు, ఇంజనీరింగ్ ఎక్సలెన్స్ అవార్డు మరియు హోమి జె భాభా గోల్డ్ మెడల్ వంటి ఇతర అవార్డులను కూడా ఆయన అందుకున్నారు. 2017లో ఆసియన్ సైంటిస్ట్ ద్వారా ఆసియన్ 100 వ సైంటిస్ట్ అవార్డు గ్రహీత అయ్యారు. వివిధ ఉన్నత విద్యా సంస్థలలో జరిగిన వివిధ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ సతీష్ రెడ్డి గారు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. ఎల్లప్పుడూ మీ రంగంపై దృష్టి కేంద్రీకరించి కట్టుబడి ఉండండి, ఉన్నదానికి మించి మరింత ఉన్నతముగా ఆలోచించండి, కొత్త పరిష్కారాలను సృష్టించండి, వైఫల్యాన్ని ఒక మెట్టుగా అంగీకరిం చండి, సమాజానికి దేశానికి సేవ చేయడానికి మీ నైపుణ్యాలను ఉపయోగించండి, మీ జ్ఞాన స్థావరాన్ని ఎల్లప్పుడూ నవీకరించుకోండి వంటి కీలక ప్రేరేపిత ఉపన్యాసాలు చెబు తారు. విద్యార్థులు ఆయన అంకితభావాన్ని ప్రేరణగా తీసుకోవాలి, ఈ సందర్భంగా సతీష్ రెడ్డితో ఒక చిరస్మరణీయ క్షణాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. పుత్తూరు లోని సిద్ధార్థ్ ఇంజనీరింగ్ కళాశాల దశాబ్ద ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నప్పుడు, నేను డాక్టర్ సతీష్ రెడ్డి గారి స్వాగతం మరియు వీడ్కోలు కార్యక్రమాన్ని చూసు కున్నాను. విమానాశ్రయం నుండి ఆయన విడిదిచేసే అతిథి గృహం 12 కిలో మీటర్ల మధ్యదూరంలో డాక్టర్ సతీష్ రెడ్డికి శాస్త్రవేత్తల నుండి ప్రయోగాలకు సంబంధించి వరుసగా 5 ఫోన్ కాల్స్ వచ్చాయి. ఆయన వారి సందేహాలకు ఓపికగా సమాధానం ఇచ్చా డు. దీనిని బట్టి శాస్త్రవేత్తలకు విశ్రాంతి లేదనిపిస్తుంది. ఒక టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంట ర్వ్యూలో, ఆయన చాలా సంవత్సరాలుగా ప్రతిరోజూ అర్ధరాత్రి ఇంటికి వెళ్లేవాడని చెప్పా డు. కాబట్టి, యువత ఇలాంటి శాస్త్రవేత్తల నుండి ప్రేరణ పొందాలి. డాక్టర్ సతీష్ రెడ్డి మరిన్ని హోదాలు అధిరోహించి భారతదేశంలోని రాబోయే యువతకు ప్రేరణనివ్వగలరని ఆశిద్దాం.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# అవకాశం ఉన్నప్పుడు.. హత్యలు ఎందుకు?



మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు ఇటీవల సంచలనం సృష్టించింది. ఇండోర్ కు చెందిన సోనమ్, రఘువంశీల వివాహం జరగ్గా.. ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో ప్రియుడితో కలిసి సోనమ్ భర్తను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మీరట్లో సౌరభ్ రాజ్పుత్ అనే వ్యక్తిని అతని భార్య ముస్కాన్ రాస్తోగి, ఆమె ప్రియుడు సహిల్ శుక్లా హత్య చేసి, శవాన్ని సిమెంట్ డ్రమ్లో దాచారు. కర్ణాటకలో ఒక మాజీ డీజీపీని ఆమె భార్య కత్తితో పొడిచి హత్య చేసింది. యూపీ, ఢిల్లీ, బిహార్ ఇలా చాలా రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. భార్యలను హత్య చేస్తున్న ఘటనలు దేశంలో నిత్యకృత్యంగానే మారుతు న్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జీవితభాగస్వా ముల మధ్య హత్యలు తీవ్ర ఆందోళనను కలిగి స్తున్నాయి. అయితే ఇందులో 95 శాతానికి పైగా కేసుల్లో ఎవరికీ క్రిమినల్ రికార్డులు లేవు. 'పెళ్లి-విడాకులు' అనే రెండు అంశాలపై సామాజి కంగా వస్తున్న ఒత్తిళ్లు సామాన్య పౌరులను సైతం నేరస్తులుగా మారుస్తున్నాయి. చిన్న సొల్యూషన్ తో పరిష్కారమయ్యే సమస్యలు కూడా హత్యల వరకు దారితీస్తున్నాయి.



**ఆందోళనకరంగా జీవితభాగస్వాముల హత్యలు**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం.. 2022లో భారతదేశంలో మొత్తం 28,522 హత్య కేసులు నమోదయ్యాయి, ఇందులో దాదాపు పది శాతానికి పైగా అంటే 2,821 కేసులు జీవిత భాగస్వామి లేదా భాగస్వామి ప్రోత్సాహంతోనే జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2022లో భార్యలు భర్తలను హత్య చేసిన, చేయించిన కేసులు 220కి పైగా నమోదయ్యాయి. అంటే ప్రతి 32 గంటలకు ఒక భర్త హత్యకు గురయ్యాడు. అదే సమయంలో భర్తలు భార్యలను హత్య చేసిన, చేయించిన కేసులు 270కి పైగా నమోదయ్యాయి. ఇందులో అదనపు కట్నం, వివాహేతర సంబంధాలు, ఇలా చాలా అంశాలు ఉన్నాయి. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన డేటాను ఇప్పటికీ ఎన్సీఆర్బీ విడుదల చేయలేదు. అయితే 2023, 2024లో కూడా జీవితభాగస్వాముల హత్యలకు సంబంధించి కేసులు వేల సంఖ్యలోనే నమోదై ఉంటాయని ఒక అంచనా.

భారతదేశంలో 85 నుంచి 90 శాతం ఆరెంజ్డ్ మ్యారేజెస్ జరుగుతున్నాయి. అందులో అబ్బాయి, అమ్మాయిల సమ్మతి తీసుకోకుండానే ఒత్తిడితో చేసిన వివాహాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. భారత సమాజంలో వివాహ బంధం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య కంటే.. కుటుంబాల మధ్య ఒప్పందంగా భావిస్తారు. కులం, మతం, ఆర్థిక స్థితి, సామాజిక స్థాయిని బట్టి జీవిత భాగస్వాములను ఎంపిక చేస్తారు. అయితే ఎక్కువ శాతం పెళ్లిళ్లలో జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ సంబంధిత వ్యక్తికి ఇవ్వరు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా కుటుంబంపై ఆధారపడి ఉండడంతో వారికి నిర్ణయం తీసుకునే ఫ్రీడమ్ తక్కువగా ఉంటున్నది. చాలా మంది తమ అభిప్రాయాన్ని చెప్పలేక.. కుటుంబ సభ్యుల ఒత్తిడికి లొంగి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఆ తర్వాత అందులో ఇమడలేక నిరాశ, ఒత్తిడి, ఒంటరితనానికి గురవుతున్నారు. తమ జీవితంపై నియంత్రణ కోల్పోయి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా మహిళలు గృహ హింసకు గురవుతున్న సందర్భాలు అనేకం. విడాకులు తీసుకోవడం తీవ్ర కష్టతరం కావడం, సమాజం ఏమంటుందోననే భావించి.. ఆ వివాహ బంధం నుంచి బయటపడలేక ఆందోళనకు గురవుతున్నారు. ఆ వివాహ బంధం నుంచి ఎలాగైనా బయటపడాలనే ఆతృతతో కొన్ని సార్లు కఠిన నిర్ణయాలు తీసుకొని నేరస్తులుగా మిగిలిపోతున్నారు. భారతదేశంలో విడాకుల ప్రక్రియలో అనేక సంక్లిష్టతలు ఉన్నాయి. పెండ్లి లాగే విడాకులు కూడా ఒక సుదీర్ఘమైన, సంక్లిష్టమైన, ఖర్చుతో కూడుకున్న ప్రక్రియగా మారింది. ఇది విడిపోవాలనుకునే వారికి తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నది. అంతేకాకుండా విడాకులు తీసుకున్న మహిళలను సమాజం ఇప్పటికీ చిన్నచూపు చూస్తున్నది. విడాకుల తర్వాత మహిళలు ఒంటరితం, ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటున్నారు. మహిళలు విడాకులు ఇచ్చిన పురుషులను సైతం చాలా మంది చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా భరణం చెల్లించాల్సి వస్తుందనే కారణంతో భార్యలను పురుషులు హత్యలు చేస్తున్నారని కొన్ని నివేదికలు సూచి స్తున్నాయి. 2022 డేటా ప్రకారం భారతదేశంలో విడాకుల రేటు ప్రతి వెయ్యి మందికి 0.01 (వెయ్యి మందికి ఒకరు) మాత్రమే. 2020లో ఇది 0.022 ఉండగా, 2021లో 0.077 మాత్రమే ఉన్నది. అయితే, ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో విడాకుల రేటు మెల్లమెల్లగా పెరుగుతున్నది. అయితే ఇతర దేశాలతో పోల్చుకుంటే ఈ శాతం చాలా తక్కువ. అయితే ఒక నివేదిక ప్రకారం 2023 వరకు దేశంలో సుమారు ఏడు లక్షలకు పైగా విడాకుల కేసులు వివిధ కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. విడాకుల ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. ఈ జాప్యం వివాదాలను తీవ్రతరం చేసి హత్యల వరకు తీసుకెళ్తున్నదనే అభిప్రాయం సైతం వ్యక్తమవు తున్నది. దేశంలో జీవిత భాగస్వాముల హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. వీటి నివార ణకు కేంద్రంతోపాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసర మున్నది. సమాజంలో మార్పు వస్తేనే ఈ హత్యల నివారణ సాధ్యమవుతుంది. ఒత్తిడితో కూడిన వివాహాలు భారతదేశంలో చట్టవిరుద్ధం. అయినా ఇది దేశంలో అమలు కావడం లేదు. ఇద్దరి సమ్మతి ఉంటేనే పెళ్లి చేయాలి. అబ్బాయి, అమ్మాయిల నిర్ణయా లను వారికుటుంబ సభ్యులు గౌరవించాలి. తమ అభిప్రాయాలను చెప్పుకునే స్వేచ్ఛ వారికి ఇవ్వాలి. వైవాహిక సంఘర్షణలు, ఒత్తిడి, లేదా హింసాత్మక ధోరణులను నివారించడానికి జంట లకు మానసిక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. వివాహ బంధం నుంచి బయటకు వెళ్లిపోయినా.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకు నేలా పథకాలను అమలు చేయాలి. పెళ్లి చేయడానికి అయ్యే ఖర్చును భారీగా తగ్గించాలి. రిజిస్టర్డ్ మ్యారేజెస్ ను ప్రోత్సహిం చాలి. అంతేకాకుండా వివాహ బంధంలో ఇమడలేమని భావిస్తే.. ఆ బంధం నుంచి బయటపడేలా విడాకుల ప్రక్రియను సైతం సులభతరం చేయాలి. ముఖ్యంగా మహిళల కోసం, లీగల్ ఎయిడ్ సేవలను మరింత అందుబాటులోకి తీసుకు రావాలి. ఉచిత లేదా తక్కువ ఖర్చుతో కూడిన న్యాయ సహాయం అందించాలి. విడాకులను ఒక వైఫల్యంగా చూడడం కంటే.. ఒక వ్యక్తి స్వాతం త్ర్యం, ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన ఎంపికగా సమాజంలో ప్రచారం చేయాలి.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

# నేలల్ని నిస్సారం చేస్తున్నామా?



నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించబడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించి పోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది. భూ క్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోత పడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం పాటించాలని 1994లో ఐరాస తీర్మానించింది. 2025 ప్రపంచ ఎడారీ కరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా భూమిని పునరుద్ధరించడం అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రకృతికి పునాది సారవంతమైన నేల. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి. ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో హరిత విప్లవం రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలిమన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది. అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రకమైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి.

ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలియన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది. వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూదిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి.

మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.

**(17 జూన్ ప్రపంచ కరువు వ్యతిరేక దినం)**


**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# అవకాశమిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



ప్రతి విద్యార్థికి చదివే హక్కు ఉంది. చదవాల్సిన అవసరం ఉంది. సాధారణ పిల్లలతో పాటు వైవిధ్య సామర్థ్యాలున్న వారిని ఒకే రకమైన పాఠశాలలకు ఆహ్వానించి రేపటి సమాజానికి ప్రతీకలుగా తయారుచేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (మైల్డ్, మోడరేట్ స్థాయి) ప్రత్యేకంగా విద్యను అందించినప్పుడు వారి పోషించాలి. స్కూల్ పరిసరాల్లోని పిల్లలలో ప్రత్యేక అవసరాలున్న వారిని గుర్తించాలి. ఆర్ పి డబ్ల్యూ డి చట్టం ప్రకారం 21 రకాలలో ఏదైనా సంబంధిత అంగవైకల్యం ఉన్న పిల్లలను గుర్తించి వారి వివరాలు నమోదు చేయాలి. అంగవైకల్య ధ్రువీకరణ ఉండకపోయినా, సింటమ్స్ కనిపించిన పిల్లలను అవసరమైన వైద్య పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించాలి. తల్లిదండ్రులకు ఇంక్లూజివ్ విద్య అవసరాన్ని వివరించాలి. భవితకేంద్రం, ఇండివిడ్యులైసేడ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం, సదుపాయాల

**ఇంక్లూజివ్ స్కూళ్లు – సమాజ మార్పుకు విద్యా వేదికలు**




అవసరాలకు తగినట్లుగా బోధనాభ్యసన ప్రక్రియలు చేపట్టినప్పటికీ, భవిష్యత్తు సమాజంలో మిగతా వారితో కలిసి జీవించడంలో సమస్యలు ఎదుర్కోవచ్చు. అదే ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాల్లో అందరూ కలిసి ఉండటం వల్ల అది భవిష్యత్తుతో మంచి సర్దుబాటుకు దోహదం చేస్తుంది.

ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అన్ని రకాల పిల్లలు వారి సామర్థ్యాలు లేదా వైకల్యాలతో సంబంధం లేకుండా ఒకే తరగతి గదిలో కలిసి చదువుకునేలా చేస్తుంది. సాధారణ పాఠశాలల్లోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన సహాయక ఉపకరణాలను మరియు బోధనా పద్ధతులను ఉపయోగించి బోధన అందిస్తారు. విద్యార్థులం దరికీ సమాన అవకాశాలు కల్పించడం మరియు వారిని విద్యా ప్రక్రియలో చురుకుగా పాల్గొనేలా చేయడం.

ప్రతి విద్యార్థి విలక్షణమైన పిల్లవాడిగా గుర్తించి, అతనిలోని వైవిధ్య అవసరాలు కలిగించే ఒత్తిడి నుంచి స్వేచ్ఛ పొంది, ఎలాంటి అడ్డంకులు లేని అభ్యసనాన్ని కొనసాగించేలా చూడాల్సిన బాధ్యత సమ్మిళిత పాఠశాలల పైన ఉంది. కాబట్టి స్నేహపూర్వక అభ్యసన వాతావరణాన్ని ఏర్పర చడంలో బహుళ వనరులను కల్పించాలి. ఇవి పిల్లల వైవిధ్య అవసరాలను తీర్చేందుకు దోహదం చేస్తాయి.

తెలంగాణ రాష్ట్రంలో 'బడిబాట' కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ డే జూన్ 17 సందర్భంగా పిల్లల చైతన్యం, తల్లిదండ్రుల అవగాహన, సమగ్ర విద్యకు మార్గదర్శనం స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బాధ్యతలు ప్రత్యేకంగా ఉండాలి. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అంటే ఒకే తరగతిలో ప్రతి ఒక్కరు - సాధారణ విద్యార్థులు మరియు ప్రత్యేక అవసరాల విద్యార్థులు కలిసి చదవడమే. దీనిని ప్రచారం చేయడంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ కీలక పాత్ర గురించి తెలియజేయాలి. ఇప్పటికే స్కూల్లో చేరిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఇండివిడ్యులైజేడ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ప్రకారం షార్ట్ టర్మ్ గోల్స్, లాంగ్ టర్మ్ గోల్స్ అభివృద్ధి స్థాయిని సమీక్షించాలి. కొత్తగా గుర్తించిన పిల్లలకోసం తగిన విధంగా ప్రాథమిక వ్యక్తిగత విద్యా ప్రణాళిక రూపకల్పనలో భాగస్వామ్యం అవ్వాలి. సాధారణ పిల్లలతో కలిసి ప్రత్యేక అవసరాల పిల్లలు కూడా పాల్గొనగలిగే ఆటలు, పాటలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలి. సామరస్యంగా మెలగడం, సహకరించడం వంటి విలువలు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి. భవిత కేంద్రం, ఇంక్లూజివ్ పాఠశాల పిల్లల చేత తయారు చేసిన వస్తువులు, డ్రాయింగ్, ఆర్ట్ వర్క్లను ప్రదర్శించాలి. విజయవంతమైన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కథలు, ఫోటోలు ఉంచడం ద్వారా మోటివేషన్ కలిగించాలి. భవిత కేంద్రం, విద్యా శాఖ, వైద్య శాఖ, ఎన్జీవో వంటి సంస్థలతో కలిసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. అవసరమైతే వైద్య పరీక్షలు, స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటుచేయడం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల అభిప్రాయాలను సేకరించి నివేదిక ఇవ్వాలి.ప్రత్యేక అవసరాల పిల్లలకోసం ఏమైనా కలిపే అవకాశం ఉందా అని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ సూచనలివ్వాలి.

ఇంక్లూజివ్ డే రోజు జరిగిన కార్యకలాపాలపై నివేదిక తయారు చేయాలి. ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు వివ రాలు, పాల్గొన్న పిల్లల సంఖ్య, ఫొటోలు, వీడియోల తో సహా రిపోర్ట్ తయారు చేయాలి. తెలం గాణలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ ప్రగతికి మద్దతు ఇవ్వండి!

**- డా. అట్ల శ్రీనివాస్‌రెడ్డి**
9703935321

# బిజెపి నిర్ణయాలు దేశానికి ప్రమాదకరం

- ప్రజాస్వామ్యాన్ని అపవాస్యం చేస్తున్న మోడీ
- కాళేశ్వరంపై అధికార ప్రతిపక్ష ఆరోపణలతో కాలయాపన
- పెండింగ్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి




**సూర్యాపేట జూన్ 16 (మనం ప్రతినిధి):** ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపితో దేశానికి ప్రమాదకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి విమర్శించారు. సోమ వారం మోతే మండల పరిధిలోని విబాలాపురం గ్రామంలో మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక హక్కులను దేశంలో బిజెపి ప్రభుత్వం కాల రాస్తు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతుందని ఆరోపించారు. దేశంలో ఆర్ఎస్ఎస్ ఎజెండాను బిజెపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఓట్ల కోసం మోడీ ప్రభుత్వం కులాల మధ్య, మతాల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తుందని విమర్శించారు.2026 మార్చి వరకు దేశంలో నక్సలిజంన్ని నిర్మూలిస్తామని పదే పదే ప్రకటనలుచేస్తు నరమేధం సృష్టిస్తూ మావోయిస్టులను కాల్చి చంపి వేస్తున్నారని శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు జరపకుండా ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతుందన్నారు. పాకిస్తాన్ తో మాత్రం తో చర్చలు జరుపుతామని ప్రకటించిన మోడీ ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలకు సిద్ధం కావట్లేదని ప్రశ్నించారు. బిజెపి తప్పుడు పద్ధతులను ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులు పెడుతున్నారని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రతి ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సాధించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని రైతాంగానికి వెంటనే రైతు భరోసా రైతుల ఖాతాలో జమ చేయాలని తెలిపారు పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న దేశవ్యాప్తంగా పాలస్తీ నాకు సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ నిర్వహించింది అన్నారు. గ్రామస్థాయి నుండి ఢిల్లీ స్థాయి వరకు పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపి వేయాలని నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిస్థితులు, అఖిలభారత మహాసభ నిర్ణయాలు అనే అంశంపై సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం అనే అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు క్లాసునుబోధించారు.

ఈ శిక్షణ తరగతులలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, సిపిఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డి, సిపిఎం మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, కక్కిరేణి సత్యనారాయణ, కాంపాటి శ్రీను, కిన్నెర పోతయ్య, బూడిద లింగయ్య, సోమ గాని మల్లయ్య, దోసపాటి శ్రీను, జంపాల స్వరాజ్యం, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వెలుగు మధు, నాయకులు చెరుకు శ్రీను, బిర్రాజు వెంకన్న, పాటల గోపి, ఒగ్గు సైదులు, కోడి లింగయ్య, మేకల ఉపేందర్, గుండాల బయ్యన్న, కాశ బోయిన రాములు, నిమ్మర బోయిన మల్సూర్ పాల్గొన్నారు.

# రాజన్నసేవలో మంత్రి అడ్లూరి



**వేములవాడ జూన్16 (మనం న్యూస్):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలసి రాజన్న ను దర్శించుకున్నారు ఎస్సి ఎస్టీ సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వాగతం పలికారు. మంత్రి ఆదివారం వేములవాడ ఆలయానికి విచ్చేయగా.. విప్, కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. మంత్రి వేములవాడలో ఆదివారం రాత్రి బస చేసి సోమవారం ఉదయం శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్, విప్ ఆది శ్రీనివాస్ లకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికినారు. స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకొన్న అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. కల్యాణ మండపం లో మంత్రి ,విప్ లకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వదించిన అనంతరం ఆలయ ఈఓ రాధ బాయ్ శేష్ వస్త్రం అందించి లడ్డుప్రసాదం తో పాటుగా స్వామి వారి చిత్రపటం ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ రాజన్నను ఇంటి ఇలవేల్పుగా కొలుస్తామని, కార్యకర్తల కృషితో మంత్రి పదవి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఇన్చార్జి ఈవో, ఎస్ డి సి రాధాబాయి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు చెక్




**రామగిరి, జూన్ 16 (మనం న్యూస్):** భూ భారతి తో భూ సమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుంది అని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి అన్నారు. కమాన్ పూర్ మండలం లోని పేరాపల్లి గ్రామపంచాయతీ లో భూభారతి గ్రామ సభను నిర్వహించారు. ఇందులో మొత్తం భూ సమస్యలపై 27 దరఖాస్తులు అందినట్లు తహసిల్దార్ వాసంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణి స్థానంలో తెలంగాణ ప్రభుత్వం భూభారతి ప్రవేశపెట్టిందని దానికి అనుగుణంగానే దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న భూముల సమస్యను భూభారతి ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ సతీష్, ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్ గోస్కుల రజిత, శ్రీనివాస్, రంజిత్, రాజేందర్, రికార్డర్, అసిస్టెంట్ శ్రీనివాస్, కట్ట కుమార్, ధరణి ఆపరేటర్ ప్రదీప్, మీసేవ ఆపరేటర్ తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై వెంటనే స్పందించాలి

- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య




**సంగారెడ్డి, జూన్ 16 (మనంప్రతినిధి):** వివిధ శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించి జిల్లాలో కలిస్తే సమస్యలకు వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం మొట్టమొదటిసారిగా జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి తన వద్దకు పంపి ఫైల్స్ కు పూర్తి సమాచారంను జత చేసి ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న ఫైల్స్ ను పంపాలని కలెక్టర్ జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో తలెత్తి సమస్యలకు గురించి ఆయా శాఖల అధికారులు వెంటనే తనకు నేరుగా సమాచారం ఫోన్ ద్వారా గాని వాట్సాప్ కాల్ ద్వారా గాని ఇవ్వాలన్నారు. ఆయా శాఖలలో పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని ఈ కలెక్టర్ సూచించారు. త్వరలో వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షకు అధికారులు పూర్తి సమాచారంతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. నివేదికలలో తాజా సమాచారం కూడా అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు జిల్లాలో పర్యటనలకు వెళ్ళినప్పుడు ఆయా ప్రాంతాలకు సంబంధించిన పూర్తి సమాచారం వెంట అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులు స్పందించాలని సూచించారు. అధికారులు తమ వద్ద ఫైలు పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి, పద్మజరాణి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


# మాకు పెన్షన్ ఇప్పించండి




- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిద్దిపేట పీఎఫ్ కమిషనర్
- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన

**సిద్దిపేట అర్బన్, జూన్ 16, మనం న్యూస్:** హయ్యర్ పెన్షన్ కు దరఖాస్తు చేసుకొని డీడీ కట్టిన తర్వాత హైదరాబాద్ కార్యాలయం నుండి పెన్షన్ రిలీజ్ అయి మూడు నెలలు గడుస్తున్నా సిద్దిపేట పిఎఫ్ కార్యాలయం కమిషనర్ పెన్షన్ ఇప్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పిఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మీడియాతో మాట్లాడుతూ 2014 సెప్టెంబర్ తర్వాత హయ్యర్ పెన్షన్ అమల్లోకి వచ్చిందని ఆ తర్వాత రిటైర్డ్ అయిన ఎంప్లాయిస్ హయ్యర్ పెన్షన్ కోసం వచ్చిన డిడి అమౌంట్ కూడా కట్టుకోవడం జరిగిందని తెలిపారు. గతంలో 70 మందికి పైగా అప్పటి కమిషనర్ ఎటువంటి ఆటంకాలు లేకుండా పెన్షన్లు రిలీజ్ చేస్తే ప్రస్తుత కమిషనర్ 26 మందికి పెన్షన్ రిలీజ్ అయి మూడు నెలలు గడుస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పని కావడం లేదని సదరు అధికారి అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. పని అవడానికి కార్యాలయ సిబ్బంది కూడా డబ్బుల రూపంలో ఆశపడ్డారని కూడా ఆరోపించారు. తమకు న్యాయం చేసి మంజూరైన పెన్షన్ డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ విషయమై సిద్దిపేట పిఎఫ్ కమిషనర్ వివరణ కొరకై సంప్రదించగా ఆమె ఆఫీసులో అందుబాటులో లేదు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ తిరుపతి గౌడ్, రాజయ్య రిటైర్డ్ ఆర్టిసి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూముల వేలంపాటలో గోల్ మాల్



**కోదాడ,జూన్ 16(మనం న్యూస్):** కోదాడ పట్టణ పరిధిలోనే తమరబండపాలెంలో గల ఎంతో పురాతనమైన శ్రీ దేవల్ బాలాజీ దేవాలయము,రెండో భద్రాద్రిగా విరజిల్లుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాలు కలవు.ఈ దేవాలయాలకు ఎంతో విలువైన భూములు కలవు.ఈ భూములకు సంబంధించి ప్రతి సంవత్సరము ప్రభుత్వము వేలంపాట నిర్వహించడం జరుగుతున్నది..ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వేలంపాట నిర్వహించదలిచారు.ఈ వేలం పాట వేసే ముందు దేవాలయ భూములను ఒకసారి సర్వే చేయించాలని పలువురు రైతులు వాపోతున్నారు.గతంలో సర్వే చేయించాలని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్న వారు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు తప్ప సర్వే చేయట్లేదని పలువురు రైతులు వాపోతున్నారు.వేలం పాట నిర్వహించే భూములు పట్టా పుస్తకంలో ఉన్న విధంగా భూమి లేదని అక్కడ భూమి తక్కువగా ఉంటుందని కానీ వేలంపాట మాత్రం పాస్ బుక్ లో ఉన్న భూమికి వేలంపాట నిర్వహించడం వలన వేలం పాట పాడిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత దేవాలయ భూముల అధికారులు భూములు సర్వే చేయించి అక్కడ ఉన్న భూమి ప్రకారం వేలంపాటలో నిర్వహించాలని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ కార్య నిర్వహణ అధికారి తుమ్మల వెంకట చలపతి ని చరవాణి ద్వారా వివరణ అడగా దేవాలయ భూములు తక్కువగానే ఉన్నాయి రైతులు చూసి వేలం పాట పాడుకోవాలని మేము చెబుతున్నామని అన్నారు.సర్వే చేయడానికి సర్వేయర్స్ రావడం లేదని భూభారతిలో మళ్లీ సర్వే చేయాలని అప్లికేషన్ పెడతామని తెలిపారు.

## భూభారతి సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



**తొగుట, జూన్ 16, మనం న్యూస్:** రైతులకు తమ భూముల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం భూభారతి సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తొగుట ఎమ్మార్వో శ్రీకాంత్ సూచించారు. బుధవారం కాన్గల్ గ్రామంలో ఎమ్మార్వో శ్రీకాంత్ ఆద్వర్యంలో భూభారతి సదస్సు నిర్వహించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీకాంత్ మాట్లాడుతూ రైతులకు ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి భూ భారతి సదస్సులు నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులకు వ్యవసాయ భూములపై ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే భూ భారతి సదస్సులో పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో రాంపూర్ గ్రామ రైతులు తమ భూముల సమస్యలపై 76 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూభారతి ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా భూదార్ హక్కును అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి అంతా కలిసి రావాలి

- ప్రజావాణి దరఖాస్తుల పెండింగ్ కారణాలు తెలపాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, జూన్ 16, మనంప్రతినిధి:** సిద్దిపేట జిల్లా అభివృద్ధికి అందరం కలిసి పని చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారానికి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో భాగంగా 98 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అన్నారు. వివిధ శాఖల వారీగా మే 31 వరకు ఉన్న ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల వివరాలను తెలియజేస్తూ పెండింగ్ దరఖాస్తుల వివరాలను, పెండింగ్ కు గల కారణాలను తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల డిస్పోజల్ వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ప్రారంభానికి ముందు 9:30 గంటలకు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార వివరాలపై జిల్లా అధికారులతో సమీక్షిస్తానని, గత వారం ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యల పూర్తి రిపోర్టుతో జిల్లా అధికారులు హాజరు కావాలని అన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే మాత్రమే ప్రజావాణి రోజు జిల్లా అధికారులకు సెలవు మంజూరు చేస్తానని, జిల్లా అధికారులు తప్పకుండా తన అనుమతి లేకుండా సెలవు పెట్టరాదని అన్నారు. జిల్లాలో ప్రతి ఒక్క ప్రభుత్వ శాఖ కార్యక్రమాల ప్రగతిపై ప్రతినెల 2 సార్లు చొప్పున 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా అధికారులందరూ తప్పక పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహిళల చట్టాలపై అవగాహన ఉండాలి

**తొగుట, జూన్ 16, మనం న్యూస్:** మహిళల చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తొగుట సిఐ ఎస్.కే లతీఫ్ సూచించారు. సోమవారం తొగుట మండలం వెంకట్రావు పేట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సులో పాల్గొన్న సిఐ అనంతరం మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక షెడ్యూల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. షీటీమ్ ప్రాముఖ్యత నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల గురించి, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు వాటి పరిణామాల గురించి, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాల గురించి, సోషల్ మీడియా పరిణామాల గురించి, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి అవగాహన కల్పించారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు, లాభాల గురించి, గతంలో జరిగిన నేరాల గురించి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధించినా రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 సిద్దిపేట షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ మహిమ కౌసర్, గజ్వేల్ షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ మహేందర్ రెడ్డి, మహిళా కానిస్టేబుళ్లు శ్యామల, లావణ్య, కానిస్టేబుళ్లు మహేష్, రామచంద్రారెడ్డి. తొగుట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్ పోస్టర్ ఆవిష్కరణ

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, జూన్ 16( మనం ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా ఐసీసీ సమావేశ మందిరంలో జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సా.ప్రా.సంస్థ), హైదరాబాద్ వారు హకీంపేట / ఆర్.ఎస్.ఎస్, కరీంనగర్ / ఆర్.ఎస్.ఎస్ మరియు ఆదిలాబాద్లో ఉన్న తెలంగాణ స్పోరట్స్ స్కూల్స్ 4వ తరగతిలో ప్రవేశాల కొరకు బాలబాలికల ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. హకీంపేట: బాలురకు 20, బాలికలకు 20, కరీంనగర్: బాలురకు 20, బాలికలకు 20,ఆదిలాబాద్: బాలురకు 20, బాలికలకు 20 ,మొత్తం సీట్లు 120 అందుబాటులో ఉన్నట్లు తెలిపారు . మండల స్థాయి ఎంపికలు 16 జూన్ నుండి 19 జూన్ 2025 వరకు ఎంపికల షెడ్యూల్ జరుగుతాయని పేర్కొన్నారు . జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 25 , 26 తేదీలలో ఉదయం 9:00 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం సంగారెడ్డి లో ప్రారంభం అవుతాయని తెలిపారు. అర్హతలు-- 4వ తరగతి ప్రవేశానికి 01.09.2016 నుండి 31.08.2017 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు. రాష్ట్ర స్థాయి ఎంపికలు: జిల్లాలో ఎంపికైన 20 బాలురు, 20 బాలికలు హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికల్లో జూలై 3 మరియు 4, 2025న పాల్గొంటారు. వెంట తీసుకురావలసిన పత్రాలు:1. పుట్టిన తేది మరియు చదువుతున్న పాఠశాల నుండి సర్టిఫికెట్ 2. 4వ తరగతి బోనఫైడ్ 3. ఆధార్ కార్డ్ 4. పాస్ పోర్ట్ సైజు 5 ఫోటోలు 5. 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ 6. కమ్యూనిటీ సర్టిఫికెట్. ఎంపిక విధానం: వైద్య పరీక్షలు అనంతరం, క్రింది 9 శారీరక సామర్థ్య పరీక్షలలో విద్యార్థులను ఎంపిక చేస్తారు: ఎత్తు,బరువు 30 మీ. ఫ్లయింగ్ స్టార్ట్ పరుగులు ,స్టాండింగ్ బ్రాడ్ జంప్ 800 మీటర్ల పరుగు, మెడిసిన్ బాల్ త్రో వర్టికల్ జంప్ ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 610 మీటర్ల షటిల్ రన్. ఆన్లైన్ రిజిస్ట్రేషన్: 07-06-2025 నుండి ఆన్లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. విద్యార్థులు తమ మొబైల్ ద్వారా వెబ్సైట్లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు . ఇతర సమాచారం కొరకు జిల్లా యువజన మరియు క్రీడా శాఖ కార్యాలయం, సంగారెడ్డి , ఫోన్ నెం.: 7981798957 ను సంప్రదించాలని తెలిపారు . ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజరాణి, జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి ఖాసిం బేగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలి

**భువనగిరి, జూన్ 16(మనం న్యూస్) :** వివిధ ప్రాంతాల ప్రజల సమస్యల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.

సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 59 అర్జీలను, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అందులో రెవిన్యూ శాఖ 37,జిల్లా పంచాయతీ శాఖ 8, ట్రాన్స్కో 3, జిల్లా పరిషత్ 2, జిల్లా సంక్షేమ శాఖ 2, ఆర్.టి.సి, మున్సిపాలిటీ, ఈ.డి. యం, సర్వే ల్యాండ్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, శానిటేషన్, సీజనల్ వ్యాధులు, మిషన్ భగీరథ, అంగన్వాడీ, భూ భారతి , విద్య సంస్థలు, సంబంధిత శాఖల అధికారులందరూ తమ శాఖల పనుల పై దృష్టి సారించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో ఉన్న మంచి నీటి ట్యాంకర్లను ఎప్పటికపుడు శుభ్రపరచలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల తరగతి గదులలో ప్రతి రోజు శానిటేషన్ కొనసాగించాలన్నారు. డ్రైనేజ్ పైపులు లీకేజీ కాకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పాఠశాలలో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. మండలాల్లో జరుగుతున్న రెవెన్యూ భూ భారతి సదస్సులు ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుళ్ల 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రారంభం

**కరీంనగర్, జూన్ 16(మనం ప్రతినిధి):** పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఎంపికై వివిధ కారణాలచే శిక్షణకు వెళ్లలేని 91 మందికి గాను 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ స్థానిక కరీంనగర్లోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణకు ఎంపికైన వారిలో వివిధ విభాగాలకు చెందిన వారు ఉన్నారు: సివిల్ - 25, ఏఆర్ - 11, టీజీఎస్పీ - 52, ఎస్పీఎఫ్ - 01, ఐటీ అండ్ సీ - 02.ఈ కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన పోలీస్ కమీషనర్కు పీటీసీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన పోలీస్ కమీషనర్, పీటీసీ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఎస్సీటీ పీసీలతో ఏర్పాటు చేసిన సమావేశ.ంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ, దేశంలోనే తెలంగాణ పోలీసులు మొదటి స్థానంలో నిలిచారని




గుర్తుచేశారు. పోలీస్ శాఖలో ఎంపికవడం అదృష్టమన్నారు. పోలీసు అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసేందుకు లభించిన మంచి అవకాశమని అన్నారు. 9 నెలల పాటు అందించే ఈ శిక్షణను ఎంతో క్రమశిక్షణతో నేర్చుకోవాలని ఆయన సూచించారు. శిక్షణలో నేర్చుకునే అంశాలే రేపు సర్వీసులో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ శిక్షణలో రెండు సెమిస్టర్లుగా చట్టాలపై అవగాహనతో పాటు ఆయుధాలపై పట్టు సాధించేలా శిక్షణ అందిస్తారని వివరించారు. ముఖ్యంగా పోలీసులు వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకునే చర్యలపై కూడా శిక్షణ అందిస్తారని, వాటిని సమర్థవంతంగా అందిపుచ్చుకోవాలని పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అడిషనల్ ఎస్పీ , ఎం. పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ బి. మోహన్ (డీఎస్పీ), డీఎస్పీలు మల్లికార్జున్, మహేష్ బాబు, శ్రీనివాస్, విజయపాల్ రెడ్డి, గంగాధర్, శివరామయ్య తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



**కోదాడ,జూన్ 16 (మనం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు.సోమవారం కోదాడ మండలం దొరకుంట,చిమిరియాల గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించారు.ఎమ్మెల్యే మొదటగా దొరకుంట గ్రామానికి చేరుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,మాజీ ఎంపీటీసీ పాలకి అర్జున్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అర్జున్ గ్రామానికి పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసి కొనియాడారు.నిరంతరం గ్రామ ప్రజల అభివృద్ధికి పాటుపడ్డ వ్యక్తి అర్జునుని తప్పనిసరిగా వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.అనంతరం చిమిరియాల గ్రామంలో ఎన్ఆర్జిఎస్ నిధులు 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు.అభివృద్ధిలో ఎక్కడ వెనకడుగు వేయడం లేదని గ్రామాలలో నాయకులు అభివృద్ధి కోసం నిధులు అడిగిన వెంటనే మంజూరు చేస్తున్నామన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ పూర్తిస్థాయిలో స్థానాలను కైవసం చేసుకుంటుందని కార్యకర్తలు నాయకులు సంసిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ,జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు వంగవీటి రామారావు,తాసిల్దార్ వాజిద్ అలీ,ఎంపీడీవో రామచంద్రరావు,చిమిర్యాల పిఎసిఎస్ చైర్మన్ కొత్త రఘుపతి,మండల పార్టీ అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి,కొత్త గురవయ్య,పాలకి సురేష్,కొండా పూర్ణ,గద్దల వెంకటేశ్వర్లు,హనుమంతరావు,గద్దె నరేందర్,మాజీ సర్పంచ్ కొండా శైలజ,ఎర్రమల బెంజిమెన్,శరబ య్యా,ముంద్ర రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో కాకతీయ స్కూల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం

**భువనగిరి, జూన్ 16( మనం న్యూస్) :** యదాద్రి భువనగిరి పట్టణ కేంద్రంలోని కాకతీయ స్కూల్ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్ సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాకతీయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ను సోమవారం స్థానిక భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ చేతుల మీదిగా కాకతీయ స్కూల్ ప్రారభించారు. ఈ సందర్భంగా కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే విద్యాసంస్థల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న కాకతీయ ఎడ్యుకేషనల్ గ్రూప్స్ భువనగిరి ప్రాంతంలో విద్యార్థుల కోసం మంచి భవిష్యత్తు నిర్మాణం కోసం కాకతీయ విద్యాసంస్థలు నెలకొల్పడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు నూతన సాంకేతిక



విద్య సాంస్కృతిక శారీరక మానసిక ఆధ్యాత్మిక దేవాలయాలుగా తీర్చిదిద్దాలని కోరారు. భువనగిరి పట్టణ ప్రాంతం పిల్లలకు మంచి నాణ్యమైన విద్యా అందించాలని కాకతీయ స్కూల్ క్లాస్ రూమ్ లో కూడా చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల వస్తువులు మంచి విద్య నైపుణ్యమైన ఉపాధ్యాయులు ఏర్పాటు చేసి విద్యార్థులంతా ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కాకతీయ పాఠశాల యాజమాన్యాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ గ్రూప్ ఆర్ డైరక్టర్స్ సీతారాం రెడ్డి, రాజేశ్వర్, వెంకట్ రెడ్డి, నరేందర్ బాలరాజు, సంతోష్, శ్రీనివాస్ శర్మ, శశికాంత్ రెడ్డి, డాక్టర్ అమర్నాథ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, గ్యాస్ చిన్న, గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# హజ్ యాత్రికుల విమానానికి తప్పిన ముప్పు

**లఖ్నవు, జూన్ 16 :** హజ్ యాత్రికులతో లఖ్నవు విమానాశ్రయానికి చేరుకున్న సౌదీ అరేబియా ఎయిర్లైన్స్కు చెందిన విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది.250 మంది హజ్ యాత్రికులతో జెడ్డా నుంచి బయల్దేరిన సౌదీ ఎయిర్లైన్స్ విమానం లఖ్నవూలోని అమౌసి విమానాశ్రయంలో దిగింది. ఆ తర్వాత.. టాక్సీ మార్గంలో వెళుతుండగా విమానం ఎడమ టైర్ నుంచి నిప్పురవ్వలు, దట్టమైన పొగలు వచ్చినట్లు విమానాశ్రయం అధికారులు సోమవారం వెల్లడించారు. వెంటనే, అప్రమత్తమైన పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్కు సమాచారం అందించడంతో సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలు ఆర్పారని తెలిపారు. అనంతరం ప్రయాణికులను విమానం నుంచి సురక్షితంగా దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌదీ అరేబియా ఎయిర్లైన్స్కు చెందిన విమానం శనివారం రాత్రి 11:30 గంటలకు సౌదీలోని జెడ్డా విమానాశ్రయం నుంచి 250 మంది హజ్ యాత్రికులతో బయలుదేరింది. ఆదివారం ఉదయం 6:30 గంటలకు లఖనవ్లోని అమౌసి విమానాశ్రయానికి చేరుకుంది. రన్వేపై దిగిన తర్వాత, విమానం టాక్సీవే పైకి వస్తుండగా దాని ఎడమ చక్రం నుంచి మంటలు, పొగ రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్కు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు దాదాపు 20 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పారు.

# ఆ వంతెన ప్రమాదకరమని ముందే హెచ్చరించాం

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

**పుణె, జూన్ 16 :** మహారాష్ట్రలోని ఇంద్రాయణి నదిపై వంతెన కూలిపోయిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఈ వంతెన ప్రమాదకరమని ఘటన జరగకముందే



హెచ్చరించామని తెలిపారు. దీని తీవ్రత గురించి తెలియక పర్యటకులు దానిపైకి వెళ్లి ఉంటారని అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''ప్రమాద ఘటన జరగకముందే ఆ వంతెన ప్రమాదకరమని స్థానిక కలెక్టర్ ఇప్పటికే ప్రకటించారు. అక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కానీ, దాని తీవ్రత గురించి తెలియక అధిక సంఖ్యలో వంతెన పైకి వెళ్లారు. తుప్పు పట్టిన వంతెన బరువు ఆపలేక కూలిపోయింది. అయితే.. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి'' అని ఫడ్నవీస్ తెలిపారు. ఈ ప్రమాదం తర్వాత పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా.. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

# అమెరికాలో రోడ్డెక్కిన లక్షల మంది

- ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా 'నో కింగ్స్' పేరుతో నిరసన
- వాషింగ్టన్లో సైన్యం కవాతు

**వాషింగ్టన్, జూన్ 16 :** ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, వలసదారుల హక్కులను కాపాడాలని కోరుతూ అమెరికాలోని ఊరూవాడా రోడ్డెక్కింది. వలసదారులను అరెస్టు చేయాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించడాన్ని నిరసిస్తూ లక్షల మంది రోడ్లపైకి వచ్చారు. వీధులు, పార్కులు, ప్లాజాలు జన నినాదాలతో హోరెత్తాయి. డౌన్టౌన్లు, చిన్న పట్టణాలు ప్రదర్శనలతో కిక్కిరిశాయి. వందల నిరసన కార్యక్రమాల్లో లక్షల మంది పాల్గొన్నారని నిరసనకారులు తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో శాంతియుతంగా ఉండాలని పలు రాష్ట్రాల గవర్నర్లు పిలుపునిచ్చారు. కొంత మంది గవర్నర్లు నేషనల్ గార్డుల కవాతుకు ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న సమయంలో అధ్యక్షుడు ట్రంప్ వాషింగ్టన్లోని సైనిక పరేడ్కు హాజరయ్యారు. శనివారం ట్రంప్ పుట్టినరోజు. దీంతోపాటు సైన్యం 250వ వార్షికోత్సవం కావడం విశేషం. లాస్ ఏంజెలెస్లో గత వారం వలస సేవలు, సుంకాల అమలు విభాగం (ఐస్) అధికారులు వలసదారులను అరెస్టు చేయడానికి ప్రయత్నించినప్పుడు ఈ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. అవి దేశమంతటా విస్తరించాయి.




గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని జనమంతా ఒక్కటై అమెరికా కోసం శాంతియుతంగా నిలిచారని, తమకు రాజులు అవసరం లేదని 'నో కింగ్స్' కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

పోర్టులాండ్లో ఆందోళనకారులను ఖాళీ చేయించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను, మూక నియంత్రణ మందుగుండు సామగ్రిని ప్రయోగించారు. ఐస్ కార్యాలయం ఎదుట ఆందోళన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది.

సాల్ట్లేక్ సిటీలోని డౌన్టౌన్లో ప్రదర్శన సందర్భంగా జరిగిన కాల్పులపై పోలీసులు విచారణ చేపట్టారు. కాల్పుల్లో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కసారిగా కాల్పులు జరగడంతో ప్రదర్శనలో పాల్గొన్న వేల మంది చెల్లాచెదురయ్యారు. న్యూయార్క్, డెన్వర్, షికాగో, ఆస్టిన్, లాస్ ఏంజెలెస్లలో 'నో కింగ్స్' బ్యానర్లతో వేల మంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అట్లాంటాలో 5,000 మంది పట్టే వేదిక నిండిపోయి మరిన్ని వేల మంది బయట ఉండిపోయారు.

సియాటిల్లో జరిగిన ఆందోళనల్లో 70,000 మంది పాల్గొన్నారు. వాషింగ్టన్లోని లోగాన్ సర్కిల్లో 200 మంది ఆందోళనకారులు 'ట్రంప్ వైదొలగాలి' అనే నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. ట్రంప్ భారీ పప్పెట్ను ప్రదర్శించారు. ట్రంప్ కిరీటం ధరించి బంగారు కమోడ్పై కూర్చున్న చిత్రాన్ని ఊరేగించారు. కొన్ని ప్రాంతాల్లో అమెరికా జెండాలను పంచారు. లాస్ ఏంజెలెస్లో కొంత మంది మెక్సికో జెండాలను ప్రదర్శించారు. వర్జీనియాలోని కల్పెప్పర్లో జరిగిన ర్యాలీపైకి ఒక యువకుడు వాహనంతో దూసుకొచ్చాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఫిలడెల్ఫియాలో, లాస్ ఏంజెలెస్లోని సిటీ హాలువద్ద, మిన్నెసోటా, నార్త్ కరోలినా, టెక్సాస్, మిసిసిపి ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి.

**నిరసనలు.. సైనిక కవాతు**

వాషింగ్టన్లో జరిగిన సైనిక 250వ వార్షికోత్సవంలో భారీ సైనిక కవాతు జరిగింది. ఒకవైపు నిరసనకారులు, మరోవైపు సైనికుల కవాతుతో నగరం హోరెత్తింది. ట్రంప్ సైనిక వందనాన్ని స్వీకరించారు. అయితే ప్రభుత్వ ధనంతో సైనిక పరేడ్ నిర్వహించడం తగదని ప్రతి 10 మంది అమెరికన్లలో ఆరుగురు అభిప్రాయపడ్డారు. ఈ డబ్బుతో సీనియర్లకు ఆహారం అందించవచ్చని కొంత మంది స్పష్టం చేశారు.

# కశ్మీర్లో తెరుచుకొంటున్న పర్యాటక ప్రదేశాలు

**శ్రీనగర్, జూన్ 16 :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్లో దాదాపు గత రెండు నెలలుగా భద్రత కారణాల దృష్ట్యా మూసి ఉంచిన పర్యాటక ప్రాంతాలు దశలవారీగా తెరుచుకొంటున్నాయి. పహల్గాం సహా చుట్టుపక్కల పలు ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి మళ్లీ పెరుగుతోంది. రహదారులపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఉగ్రదాడితో మూసివేసిన పార్కులు, పర్యాటక ప్రాంతాలన్నీ తిరిగి తెరవనున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఇటీవల ప్రకటించారు.

ముఖ్యంగా పహల్గాం మార్కెట్, వెరినాగ్ గార్డెన్, కోకర్నాగ్ గార్డెన్, అచాబల్ గార్డెన్, బేతాబ్ వ్యాలీ పార్కులు ఈ నెల 17 నుంచి తెరుచుకుంటాయని వెల్లడించారు. ఆ మేరకు జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమై లోయలో పలుచోట్ల భద్రతా దళాలను మోహరిస్తోంది. అనుమానాస్పద స్థలాలు, నదీతీర ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. జులై 3 నుంచి మొదలుకానున్న అమర్నాథ్ యాత్రకు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నందున భద్రతాపరమైన తనిఖీలను విస్తృతం చేశారు. పర్యాటకం ఆగిపోయి రెండు నెలలుగా ఉపాధి కోల్పోయిన స్థానికుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

# సివిల్ దుస్తుల్లో వస్తే అధికారిక విధులుగా భావించలేం


- 9 మంది పోలీసులపై హత్యకేసు కొనసాగాల్సిందే
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**ఢిల్లీ, జూన్ 16 :** సివిల్ దుస్తుల్లో వస్తే అధికారిక విధులుగా భావించలేమని పోలీసులకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సివిల్ దుస్తుల్లో వచ్చి కారు డ్రైవరుపై కాల్పులు జరపడంపై నమోదైన కేసులో విచారణ కొనసాగాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు 9 మంది పంజాబ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ను కొట్టేసింది. డీసీపీసహా పోలీసులపై సాక్ష్యాలను ధ్వంసం చేశారన్న అభియోగాలను పునరుద్ధరిస్తూ జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఏప్రిల్ 29వ తేదీన తీర్పు చెప్పింది. దీనిని తాజాగా సుప్రీం కోర్టు.. వెబ్సైట్లో అప్లోడ్ చేసింది. 2015 జూన్ 16వ తేదీన సాయంత్రం 6.30 గంటల సమయంలో అమృతసర్లోని వర్కా-బటాలో రోడ్డులో ఐ-20 కారులో వెళ్తున్న వ్యక్తిని బొలెరో, ఇన్నోవా, వర్నా కార్లలో వచ్చిన 9 మంది పోలీసులు చుట్టుముట్టారు. సివిల్ దుస్తుల్లో వచ్చిన వారు.. తుపాకులతో దగ్గరి నుంచి కారులో ఉన్న ముఖ్జీత్ సింగ్పై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల ఘటనను ప్రత్యక్షంగా చూసిన ఇద్దరు వ్యక్తులు అప్రమత్తం చేయడంతో స్థానికులు గుమికూడారు. ఈలోగా డీసీపీ పరంపాల్ సింగ్ అక్కడికి వచ్చారు. భారీగా పోలీసులను మోహరించాక కారు నంబరు ప్లేట్లను తొలగింపజేశారు. ఈ ఘటనపై నకిలీ ఎన్కౌంటర్ కేసు నమోదైంది. ఈ కేసును రద్దు చేసేందుకు పంజాబ్, హరియాణా హైకోర్టు 2019 మే 20వ తేదీన నిరాకరించింది. దీంతో పోలీసులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో డీసీపీతోపాటు పోలీసుల ప్రాసిక్యూషన్కు ముందస్తు అనుమతీ అక్కర్లేదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# విజయవంతంగా రాకెట్ లాంచ్ వ్యవస్థల ప్రయోగ పరీక్షలు

**కుశీనగర్, జూన్ 16 :** భారతీయ విద్యార్థుల్లో అంతరిక్ష రంగంపై ఆసక్తి పెంచడమే లక్ష్యంగా.. ఈ ఏడాది అక్టోబరు-నవంబరుల్లో ఉత్తరప్రదేశ్లోని కుశీనగర్ వేదికగా నిర్వహించనున్న పోటీలకు సన్నాహకాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా స్థానికంగా రాకెట్ లాంఛ్ వ్యవస్థలను ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా శని, ఆదివారాల్లో విజయవంతంగా పరీక్షించింది. ఇన్స్పేస్, ఇస్రో నిపుణుల మార్గదర్శకత్వంలో థ్రస్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన నమూనా రాకెట్ లాంఛర్ను.. అక్టోబరు-నవంబరుల్లో జరగనున్న పోటీల్లో విద్యార్థుల ఉపగ్రహాలను కొన్ని వందల మీటర్ల ఎత్తుకు తీసుకెళ్లేందుకు వినియోగించనున్నారు. ''తాజా పరీక్షల్లో భాగంగా ప్రయోగించిన రాకెట్ 1.1 కిలోమీటర్ల ఎత్తు వరకూ వెళ్లింది. తర్వాత అందులో నుంచి ఓ చిన్న ఉపగ్రహం (పేలోడ్) బయటకు వచ్చింది. అది 5 మీటర్ల వరకు కిందకు పడగానే.. దాని పారాచూట్ క్రియాశీలమైంది. అనంతరం ఆ ఉపగ్రహం.. 400 మీటర్ల పరిధిలోనే మైదానంలో కిందకు దిగింది'' అని ఇస్రో శాస్త్రవేత్త అభిషేక్ సింగ్ కుశీనగర్లో ప్రయోగ పరీక్ష గురించి వివరించారు.




# పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**రాబోయే మూడున్నర సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తాం**

**పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

**లబ్ధిదారుని ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ**



**నేలకొండపల్లి, జూన్ 16(మనం న్యూస్):** పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. గువ్వలగూడెం గ్రామం ఎస్సీ ప్రాంతంలో 30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, గ్రామంలోని రావెళ్ల భూలక్ష్మి నరేష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంత్రి జిల్లా కలెక్టర్ తో కలిసి భూమి పూజ నిర్వహించి దంపతులకు కొత్తబట్టలు అందించారు. గ్రామంలో ఇంటి ముందు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్ తరలించాలని మంత్రి విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం కోరట్లగూడెం గ్రామంలో షుగర్ ఫ్యాక్టరీ రోడ్ నుండి పాత కోరట్లగూడెం వరకు 2 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణానికి, మోటాపురం గ్రామంలో మోటాపురం నుండి జీళ్లచెరువు ఆర్ అండ్ బి రోడ్డు వరకు 4 కోట్ల 40 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కోరట్లగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గువ్వలగూడెం గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు 75 లక్షల రూపాయలు, లింక్ రోడ్డు నిర్మాణ పనులకు 13.5 కోట్ల రూపాయలు, మొత్తం దాదాపు 14 కోట్ల 25 లక్షలు రూపాయలను వివిధ రూపాల్లో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మన ప్రభుత్వం పేదవాడి కన్నీరు తుడిచే విధంగా, పేదవాడికి అండగా, పేదవాడికి సహాయం చేసే విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం తీసుకొని రావడం జరిగిందని అన్నారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్, పేదోడికి జబ్బు చేస్తే 10 లక్షల రూపాయల వరకు మెరుగైన వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం, ఆడబిడ్డలు ఎంత దూరం ప్రయాణం చేసినా ఉచితంగా బస్సులో ఒక్క రూపాయి చార్జీ లేకుండా ఉచిత బస్సు సౌకర్యం, ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలలో 17 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే మన ఇందిరమ్మ ప్రభుత్వం 10 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందని అన్నారు. మన ప్రభుత్వం రైతులకు సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ అదనంగా అందిస్తున్నదని, ఉగాది నుండి పేదలకు సన్న రకం బియ్యం సరఫరా చేస్తున్నదని, గత పది సంవత్సరాల్లో కొత్త రేషన్ కార్డు గాని కొత్త పేర్లు రేషన్ కార్డులో చేర్చడం కానీ జరగలేదని, మన ఇందిరమ్మ ప్రభుత్వంలో మంజూరు చేసుకున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఇల్లు అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం అని, అటువంటిది మొదట విడత రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్ళు 22 వేల 500 కోట్ల రూపాయలతో అద్భుతంగా ప్రతి నియోజక వర్గానికి 3 వేల 500 ఇల్లు ఇచ్చామని, గువ్వలగూడెంలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేసుకుంటున్నామని అన్నారు. గ్రామాలలో ఇల్లు ఇవ్వాల్సిన అర్హులైన వాళ్ళు మిగిలి ఉన్నారని, వారికి ఇల్లు రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని, రాబోయే మూడున్నర సంవత్సరాలలో నాలుగున్నర లక్షలతో కలిపి 20 లక్షల ఇందిరమ్మ ఇల్లు కట్టాలన్నదే మన ప్రభుత్వం ఆలోచనని, అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి కార్యక్రమానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాను అభివృద్ధి లో మరింత ముందుకు తీసుకుని వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి., విద్యుత్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మెచ్చా జన్మదిన వేడుకలు



ఘనంగా జరిపిన బిఆర్ఎస్ శ్రేణులు

**దమ్మపేట, జూన్ 16 (మనం న్యూస్) :** దమ్మపేట మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరావు జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ శ్రేణులందరూ కలిసి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దొడ్డా రమేష్,మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు, మండల పార్టీ రైతు సంఘం అధ్యక్షులు అంకత ఉమ మహేశ్వరావు,మాజీ ఎంపీటీసీ జలగం వాసు,నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షులు రావుల శ్రీనివాసరావు, నాయకులు తుమ్మల లక్ష్మనరావు,చీకటి రామయ్య, బేతిని నాగేశ్వరావు, నియోజకవర్గం యూత్ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షులు సత్య,మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన వెంకటేశ్వరావు, మండల నాయకులు సోయం రాజు, అబ్దుల్ జిన్న,మాజీ కో ఆప్షన్ బుడే, పాసం ప్రసాద్, కోర్స వెంకటేశ్వరావు, బలుసు గోపి,పాకనాటి శ్రీనివాసరావు,వల్లెపు నాగేశ్వరావు శ్రీను,కేసిని మధు, నాగయ్య, తోలేం మల్లేశ్వరావు,శ్రీను,మద్దెల పుల్లారావు, సున్నం నరేందర్, వాడపల్లి నాని,నాగరాజు, శేషాద్రి,నాచారం శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## సహకార వ్యవస్థ అభివృద్ధే ప్రాథమికంగా రైతు అభివృద్ధి



**కొత్తగూడెం టౌన్, జూన్ 16 (మనం న్యూస్):** సహకార వ్యవస్థ అభివృద్ధే ప్రాథమికంగా రైతు అభివృద్ధి అని సొసైటీ ఛైర్మన్ మండే వీరహనుమంతరావు పేర్కొన్నారు. కొత్తగూడెం కార్యాలయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సోమవారం సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. .రైతు బాగుంటేనే గ్రామాలు, పట్టణాలు, రాష్ట్రాలు, దేశాలు బాగుంటాయన్నారు. ఈ సంవత్సరం రైతులందరికి వ్యవసాయంలో మంచి పంటలు పండాలని, కొత్తగూడెం సంఘంను ఎఫ్‌పిఓ నమోదు చేయటం వలన రైతులకు మరింత సేవ చేయవచ్చని అన్నారు. ఎఫ్ పి ఓ ద్వారా సుజాతనగర్ మండలంలోని 700 మంది రైతుల వద్ద నుండి రూ 2500/- లు వాటాధనం కింద డిపాజిట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం కూడా అంతే వాటాధనం జమ చేస్తుందని అన్నారు. ఈ వాటధనంతో రైతులకు మరింత చౌక ధరలకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచుతామని, రైతుల అవసరమైన ట్రాక్టర్లు, వరి కోసే మిషన్లు మొదలగు వ్యవసాయ పరికరాలు కూడా ఈ ఎఫ్ పి ఓ ద్వారా అందుబాటులో ఉంచుతామని తద్వారా రైతు ఆదునిక పద్ధతిలో వ్యవసాయ చేసి రైతు మరింత లాభాలు అర్జించి, రైతు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అన్నారు, గత సంవర్సరం కొత్తగూడెం సంఘం ద్వార సుమారు 2 కోట్ల 50 లక్షల రూపాయల విలువగల ఎరువులను ఎమ్మార్పీ ధరలకు రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటి ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్నాధ రావు, సొసైటి డైరెక్టర్లు బండి అమృత రావు, గుగులోతు చందర్, కర్నాటకపు రాంచందర్ రావు,తిట్ల విజయకుమారి, సంఘ సెక్రటరి పండ్ల సారయ్య పాల్గొన్నారు.

## పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

- **కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **పెండింగ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ఏడు రోజుల్లో పూర్తి**
- **ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో బఫర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల వివరాలు సేకరణ**
- **డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా కేటాయించాలి**
- **ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై సమీక్షించిన కలెక్టర్**



**ఖమ్మం, జూన్ 16(మనం బ్యూరో):** పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి స్థాయిలో మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలం, గ్రామానికి మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య ప్రకారం, లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ కమీటిలను ఫాలో అప్ అవుతూ, బఫర్ సంఖ్యతో కలిపి లబ్దిదారుల జాబితా తెప్పించుకోవాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన జాబితాను మరోసారి ధృవీకరణ చేసి ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. పెండింగ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక, ప్రొసిడింగ్స్ పంపిణీ ప్రక్రియ వారం రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మంత్రుల ఆదేశాల మేరకు 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపికతో పాటు లబ్ధిదారుల వివరాలు సేకరించి బఫర్ జాబితా రూపొందించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల రిపోర్ట్ అందించాలని అన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ సిస్టం ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. అర్హులైన నిరుపేదలకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు చేరాలని, గతంలో లబ్దిదారులను కేటాయించని వాటికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ కమిటీ నుంచి లిస్ట్ తీసుకుని అధికారులు వెరిఫై చేసి లబ్దిదారుల ఎంపిక చేయాలని అన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో నిర్మాణం పురోగతిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వీటిని సొంత భూమి లేని నిరుపేదలకు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల క్రింద నిధులు మంజూరు చేసి పూర్తి చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ పైలెట్ గ్రామాలలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 500 పైగా గ్రౌండ్ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో దీక్షా రైనా, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఆర్డీఓ లు జి. నరసింహరావు, ఎల్. రాజేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి...

- **అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి...**
- **కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, జూన్ 16(మనం బ్యూరో):** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని, నిబంధనల ప్రకారం మనం ఏదైనా దరఖాస్తు పరిష్కారం చేయలేని సమయంలో కారణాలు తెలియజేస్తూ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు పక్కాగా ట్రాక్ చేయాలని, మండలాల పరిధి నుంచి వచ్చే సమాధానాలు ఎలా ఉంటున్నాయో క్రాస్ చెక్ చేసుకోవాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కావాలని అన్నారు. ట్విట్టర్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఆన్ లైన్ చేస్తూ ట్రాక్ చేయాలని, ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, అత్యవసర పరిస్థితుల్లో రాలేని పక్షంలో ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం నాడు ప్రజావాణి తర్వాత వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో చాలా మంచి స్టాఫ్ ఉందని, భవిష్యత్తులో మంచి పని తీరు కొనసాగించాలని అన్నారు. వేంసూర్ మండలం బీరపల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం జరుగుతుందని, వాటిని వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వేంసూరు మండలం తహశీల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకొని రిపోర్ట్ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం శ్రీరామ్ హిల్స్ ప్రాంతానికి చెందిన వనమా ఉషారాణి ధంసలాపురం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 194 లో 2 ఎకరాల వ్యవసాయ భూమి 2008 లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, ఆ భూమిని ఇతరులు ఆక్రమించారని, భూ భారతి చట్టం ప్రకారం ఆ పట్టా పాస్ పుస్తకం రద్దు చేసి తన పేరున పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు నిబంధనల ప్రకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం బొక్కల గడ్డ 47వ డివిజన్ కు చెందిన చాట్ల సునీత తాను 15 సంవత్సరాలుగా కిరాయి ఇండ్లలో ఉంటున్నానని తనకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వేంసూర్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు నాగేశ్వర రావు తమ పంట పొలాలకు రామన్న చెరువు అలుగు నీటినీ మళ్ళింపు చేసి నష్టం చేస్తున్నారని, నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనం తాగునీటి గోస...

- **చెన్నాపురం గిరిజనం దప్పిక కేకలు**
- **మూలనపడ్డ రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు**
- **చేతిపంపుల పైనే ఆధారం**





**చర్ల, జూన్ 16 (మనం న్యూస్) :** ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని మారుమూల అటవీప్రాంత గ్రామమైన చెన్నాపురంలో గిరిజనం తాగునీరు లేక గోస పడుతున్నారు. గ్రామంలో మూడు తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా అందులో రెండు పూర్తిగా మూలనపడ్డాయి. ప్రస్తుతం ఒక్క ఓవర్ హెడ్ ట్యాంక్ మాత్రమే పనిచేస్తోంది. అదికూడా గ్రామానికి ఒక మూలన ఉండటంతో వారంతా చేతి పంపులపైనే ఆదారపడుతున్నారు. వేసవి తీవ్రత కారణంగా భూగర్భ జలాలు అడుగంటడంతో చేతి పంపుల నుండి నీరు అంతంత మాత్రంగానే వస్తోంది. చర్ల మండలం చెన్నాపురం గ్రామం ఛత్తీస్ఘడ్ నుండి వలస వచ్చిన ఆదివాసీలతో సుమారు మూడు దశాబ్దాల క్రితం ఏర్పడింది. దట్టమైన అటవీప్రాంతంలో గ్రామం ఉండటంతో ఐదేళ్ల క్రితం వరకు గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడమే కాకుండా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడి గిరిజనులకు తెలుగు మాట్లాడటం రాదు. కేవలం గోండి కోయ భాష మాత్రమే వచ్చేది. కాలం మారింది. ప్రభుత్వం అటవీప్రాంత గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఎల్ డబ్ల్యూఈ నిధులతో ఐదేళ్ల క్రితం గ్రామానికి బిటి రహదారిని నిర్మించారు. దీంతో గ్రామానికి ఆటోల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఆదివాసీలు అటవీ ఉత్పత్తులు, సీతా ఫలాలను సేకరించి ఆటోల ద్వారా చర్లకు వచ్చి అమ్మకాలు సాగించి వచ్చిన నగదుతో నిత్యావసర సరుకులను కొనుగోలు చేస్తుంటారు. దీంతో వారి జీవనప్రమాణం కాస్త పెరిగింది. తెలుగు భాషను కూడా మాట్లాడటం నేర్చుకుంటున్నారు. మరోవైపు ఒకొక్కటిగా గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందటం మొదలయ్యాయి. కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ భేస్ క్యాంప్ వద్ద ఆదునిక వైద్యశాలను నిర్మిస్తున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఉండటంతో ఇక్కడి వారు స్మార్ట్ ఫోన్ లను వినియోగిస్తున్నారు. మరోవైపు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసారు. ఇంత జరిగినా గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీరు రాలేదు. అటవీ ప్రాంతం కావడంతో రిజర్వ్ ఫారెస్ట్ గుండా పైప్ లైన్ నిర్మాణానికి అటవీశాఖ అడ్డుతగలడంతో వీరు భగీరథ నీటికి నోచుకోలేదు. గ్రామంలో మొత్తం 82 కుటుంబాలు ఉండగా 400 పైనే జనాభా ఉంటుంది. వీరి తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం రెండు సోలార్ ఆదారిత వాటర్ ట్యాంకులను, ఒక విద్యుత్ ఆదారిత ట్యాంకును ఏర్పాటు చేసింది. వీటిలో పాఠశాల పక్కన 10 వేల లీటర్ల కెపాసిటీతో మూడేళ్ల క్రితం నిర్మించిన విద్యుత్ ఆధారిత వాటర్ ట్యాంక్ నుండి నిర్మించిన దగ్గర నుండి నేటి వరకు ఒక్కచుక్క తాగునీరు గ్రామస్తులకు అందిన పాపానపోలేదు. లో వోల్టేజి కారణంగా నీరు ఓవర్ హెడ్ ట్యాంక్ కు ఎక్కడం లేదు. మరోవైపు మద్య గుంపులో 5 వేల లీటర్ల కెపాసిటితో ఏర్పాటు చేసిన సోలార్ ఆధారిత మంచినీటి పథకం మరమ్మత్తులకు గురికావడంతో ప్రత్యామ్నాయంగా అదికారులు విద్యుత్ ద్వారా నీటిని ట్యాంక్ కు ఎక్కించి తాగునీటిని అందించేవారు. ఈ పథకం సైతం మూడు నెలల క్రితం మూలన పడింది. ప్రస్తుతం సండ్రెం గుంపులోని సోలార్ ఆదారిత రక్షిత మంచినీటి పథకం ఒక్కటే పనిచేస్తూ దాని చుట్టుపక్కల గల 20 కుటుంబాలకు మాత్రమే తాగునీరు అందుతోంది. మిగిలిన 60 కుటుంబాలు తీవ్ర దాహార్తితో అల్లాడుతున్నాయి. వీరంతా గ్రామంలోని చేతి పంపులపైనే ఆధారపడి తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. వేసవి తీవ్రత కారణంగా ఇవికూడా అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. పంపు పది నిముషాలు కొట్టిన తర్వాత కొద్దిగా నీరు వస్తుండగా, వాటినే జాగ్రత్తగా వాడుకుంటున్నారు. పైగుంపు గిరిజనుల పరిస్థితి వర్ణనాతీతం. ఇక్కడి ఇల్లు ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో వీరికి ఎన్నడూ తాగునీరు సరఫరా జరిగిన పాపానపోలేదు. ఇక్కడ 25 కుటుంబాలు ఉండగా మొదటి నుండి వీరు ఒక్క చేతి పంపుపైనే ఆదారపడి నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఇలా గ్రామంలో మొత్తం 80 కుటుంబాలు ఉండగా ఇందులో 60 కుటుంబాల వారు తీవ్ర నీటి ఎద్దడితో అవస్థలు పడుతున్నారు. ఎండలు మండుతున్న వేల గొంతు తడుపుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక పశువుల బాధలు వర్ణనాతీతం. గ్రామ సమీపంలో వాగులు లేకపోవడంతో అవి దాహార్తితో అల్లాడుతున్నాయి.గ్రామంలోని తాగునీటి సమస్యను గ్రామ పంచాయతీ కార్యదర్శి, తాగునీటి శాఖ అదికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆదివాసీలు వాపోతున్నారు. ఇప్పటికయినా అదికారులు స్పందించి తమ త్రాగునీటి సమస్యను తీర్చాలని గిరిజనం వేడుకుంటోంది.

**చేతిపంపులే ఆధారం : మడకం ఉంగయ్య, చెన్నాపురం గిరిజనుడు**



వేసవి తీవ్ర అవస్థలు పడ్డాము. గ్రామంలోని మూడు ట్యాంకులలో రెండు మరమ్మత్తులతో మూలనపడ్డాయి. దీంతో చేతి పంపులపైనే ఆదారపడి దాహం తీర్చుకున్నాము. భూగర్జ జలాలు అడుగంటడంతో చాలా సేపు పంపు కొట్టిన తర్వాత నీరు కొద్దిగా వస్తోంది. పశువుల పరిస్థితి మరీ దారుణం. వాటికి త్రాగునీరు దొరకక అల్లాడుతున్నాయి.

తాగునీటి పథకాలను పునరుద్ధరించాలి : దేవయ్య, గ్రామ పటేల్, చెన్నాపురం గ్రామంలోని



రెండు రక్షిత మంచినీటి పథకాలు మరమ్మతులకు గురవడంతో తాగునీరు అందక అవస్థలు పడుతున్నాము. ఈ విషయం ఎన్నిసార్లు అదికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదు. అధికారులు ఇప్పటికయినా స్పందించి మరమ్మత్తులకు గురైన తాగునీటి పథకాలను పునరుద్దరించాలి.

**మరమ్మతులు చేయిస్తాము : రాము, మిషన్ భగీరథ ఏఈ**

పాఠశాల ప్రక్కన గల వాటర్ ట్యాంక్ కు విద్యుత్ లో వోల్టేజ్ కారణంగా నీరు పైకి ఎక్కడం లేదు. కెపాసిటర్ పెట్టి నీటికి ట్యాంకులోకి ఎక్కిస్తాము. మద్యగుంపు నీటి పథకం మరమ్మత్తులకు గురయిన విషయం నా దృష్టికి రాలేదు. రేపు మెకానిక్ ను పంపించి మరమ్మత్తులు చేయిస్తాను.

# పోలీసులకు సహకరించండి..

- **తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుకండి : ఎస్ఐ**



**ఆళ్లపల్లి, జూన్ 16 (మనం న్యూస్):** గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరించినట్లు తారసపడితే వెంటనే పోలీస్ శాఖ వారికి సమాచారం అందించాలని ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్ తెలిపారు. ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన పెద్ద వెంకటాపురం పంచాయతీ భూసరాయి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి వివరాలు కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి వచ్చారా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో చతిస్గడ్ రాష్ట్రంలో జరిగిన వరస ఎదుర్కాల్పులు, అరెస్టుల వలన తీవ్రంగా నష్టపోయిన మావోయిస్టు సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలోకి వచ్చి ఆదివాసి ప్రాంతాలను నివాసంగా చేసుకుని సంచరిస్తున్నారని సమాచారం ఉందన్నారు. అటువంటివారు ఎవరైనా గ్రామంలోకి వస్తే వారికి ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. ఎవరైనా వారికి ఆశ్రయం కల్పించి కిరాణా సామాగ్రి, తినే పదార్థాలు, వస్తువుల సరఫరా చేసి వారికి సహకరించినట్లయితే వారిపై చట్ట పెట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వారికి ప్రభుత్వ నుండి లభిస్తున్న పథకాలను, సదుపాయాలను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. మావోయిస్టు సాయి దళాలు గ్రామాలలో సంచరించినట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారికి తగిన పారితోషకం ఇవ్వడంతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు తయువకులు పాల్గొన్నారు.

మనం 8 SPORTS
స్పోర్ట్స్
గుంటూరు - మంగళవారం 17 జూన్ 2025





# టీమ్ఇండియా-పాకిస్థాన్ పోరు ఎప్పుడంటే?

ఉమెన్స్ వరల్డ్ కప్ 2025లో భాగంగా అక్టోబర్ 5న టీమ్ఇండియా, పాకిస్థాన్ జట్టుతో తలపడనుంది. ఈ ఉత్కంఠ పోరుకు కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదిక కానుంది. మహిళల వన్డే ప్రపంచ కప్ సెప్టెంబర్ 30న ప్రారంభమై నవంబర్ 2న ముగుస్తుంది. మొదటి మ్యాచ్ బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో ఆతిథ్య దేశాలైన భారత్, శ్రీలంక మధ్య జరగనుంది. అలాగే బంగ్లాదేశ్, భారత్ మధ్య మ్యాచ్ అక్టోబర్ 26న బెంగళూరులో జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్గా బరిలోకి దిగుతోన్న ఆస్ట్రేలియా అక్టోబర్ 1న ఇండోర్ లో న్యూజిలాండ్ తో తలపడనుంది.

బీసీసీఐ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మధ్య హైబ్రిడ్ మోడల్ కోసం జరిగిన ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ జట్టు తన మ్యాచ్ లన్నీ కొలంబోలో ఆడనుంది. అక్టోబర్ 2న బంగ్లాదేశ్ తో, అక్టోబర్ 15న ఇంగ్లాండ్ తో, అక్టోబర్ 18న న్యూజిలాండ్ తో, అక్టోబర్ 21న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 24న శ్రీలంకతో ఆ జట్టు తలపడనుంది. మొదటి సెమీ-ఫైనల్ అక్టోబర్ 29న గుహవాటి లేదా కొలంబోలో జరగనుంది. రెండో సెమీ-ఫైనల్ మరుసటి రోజు అక్టోబర్ 30న బెంగళూరులో నిర్వహించనున్నారు. టైటిల్ డిసైడర్ కోసం సిద్ధం కావడానికి ఇద్దరు ఫైనలిస్టులకు కనీసం రెండు రోజుల సమయం ఉంటుంది. తుది పోరు నవంబర్ 2న బెంగళూరు లేదా కొలంబోలో నిర్వహించనున్నారు. వేదిక ఏదనే విషయం పాకిస్థాన్ జట్టు అర్హత సాధించడంపై ఆధారపడనుంది.

## వరల్డ్ కప్‌లో టీమ్ఇండియా మ్యాచ్ లు ఎప్పుడంటే..

సెప్టెంబర్ 30న బెంగళూరు వేదికగా శ్రీలంకతో, అక్టోబర్ 5న కొలంబోలో పాకిస్థాన్ తో, 9న విశాఖపట్నం వేదికగా సౌతాఫ్రికాతో, 12న విశాఖపట్నంలో ఆస్ట్రేలియాతో, 19న ఇండోర్ వేదికగా ఇంగ్లండ్తో, 23న గుహవాటిలో న్యూజిలాండ్ తో, 26 బెంగళూరు వేదికగా బంగ్లాదేశ్ తో టీమ్ ఇండియా తలపడనుంది.



# ఓ ప్రముఖ క్రికెటర్ నన్ను రిటైర్ అవమన్నాడు
# కరుణ్ నాయర్

దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్ట్ జట్టులోకి కరుణ్ నాయర్ పునరాగమనం చేశాడు. ఈనేపథ్యంలో రెండేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనను తాజాగా ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. ఓ ప్రముఖ క్రికెటర్ తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవమని సూచించాడని చెప్పాడు. ఆర్థికంగా భరోసానిచ్చే ఫ్రాంఛైజీ టీ20 లీగ్ లు ఆడుకోమని సలహా ఇచ్చాడని వివరించాడు. కానీ కరుణ్ నాయర్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా దేశవాళీల్లో రాణించి, తిరిగి జాతీయజట్టులోకి పునరాగమనం చేశాడు. జూన్ 20 నుంచి ఇంగ్లండ్ తో జరగనున్న అయిదు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ కు భారత జట్టు తరపున ఎంపికయ్యాడు. టీమ్ఇండియా ప్రకటించిన 18 మంది సభ్యులతో కూడిన బృందంలో స్థానం సంపాదించుకున్నాడు.

'నాకు ఇప్పటికీ గుర్తుంది. ఓ ప్రముఖ భారత క్రికెటర్ రెండేళ్ల క్రితం నాకు ఫోన్ చేశాడు. నన్ను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోమన్నాడు. ఆర్థికంగా భరోసా కోసం విదేశీ టీ20 లీగుల్లో ఆడమని సూచించాడు. అతడు చెప్పినట్లు చేయడం సులువే. కానీ నా లక్ష్యం తిరిగి భారత జట్టుకు ఆడటమే. ఈ సంఘటన రెండేళ్ల క్రితం జరిగింది. కానీ ఇప్పుడు నేను తిరిగి టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాను' అని ఆ ఇంటర్వ్యూలో కరుణ్ నాయర్ అన్నాడు. అతడు ప్రస్తుతం మంచి ఫామ్ లో కనిపిస్తున్నాడు. తాజాగా ఇంగ్లండ్ లయన్స్ తో ఇండియా ఏ జట్టు తలపడిన అనధికారిక టెస్ట్ మ్యాచ్ లో అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేసి డబుల్ సెంచరీ సాధించాడు. ప్రస్తుత భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కరుణ్ నాయర్కు మద్దతుగా నిలుస్తున్నాడు. 'మీరు ఎన్ని పరుగులు చేసినా.. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎప్పటికీ వదులుకోని మనస్తత్వం. అదే మిమ్మల్ని తిరిగి జట్టులోకి తీసుకువచ్చింది. ఇది మొత్తం ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే విషయం' అని కరుణ్ నాయర్ ను ఉద్దేశించి గౌతమ్ గంభీర్ అన్నాడు.

అలాగే కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం ఉన్న కరుణ్.. టీమ్ఇండియాకు ఎంతో మేలు చేస్తాడని గౌతమ్ గంభీర్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. నాయర్ 2023, 2024 కౌంటీ ఛాంపియన్ షిప్ సీజన్లలో నార్తాంప్టన్ షైర్ కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్ ల్లో 736 పరుగులు చేశాడు. ఇందులో చిరస్మరణీయమైన ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. అలాగే 2024-25 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహించిన అతడు 16 ఇన్నింగ్స్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్ లో ఏకంగా 779 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2024-25లో (టీ20) ఆరు ఇన్నింగ్స్లో 255 పరుగులు చేశాడు.

## భారత్‌కు వరుసగా ఆరో ఓటమి

ఐరోపా దశ ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీలో భారత పురుషుల జట్టు వైఫల్యం కొనసాగుతోంది. ఈ లీగ్ లో భారత్ వరుసగా ఆరో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్ లో భారత్ 2-3తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. శనివారం ఆసీస్ చేతిలో భారత్ పరాజయం పాలవగా.. అంతకుముందు నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో రెండేసి మ్యాచ్ ల్లో చుక్కెదురైంది. మ్యాచ్ ప్రారంభమైన మూడో నిమిషంలోనే భారత్కు సంజయ్ గోల్ అందించాడు.



నాలుగో నిమిషంలో ఆసీస్ ఆటగాడు టిమ్ బ్రాండ్ గోల్ రాబట్టి 1-1తో స్కోరును సమం చేశాడు. అనంతరం బ్లేక్ గోవర్స్ (5వ నిమిషం), కూపర్ బరన్స్ (18) గోల్స్ సాధించడంతో ఆసీస్ 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 36వ నిమిషంలో దిల్ప్రీత్ సింగ్ గోల్ చేసి ఆసీస్ ఆధిక్యాన్ని 2-3కు తగ్గించినా.. ప్రత్యర్థి విజయాన్ని భారత్ అడ్డుకోలేకపోయింది. ఈనెల 21న బెల్జియంతో భారత్ పోటీపడనుంది. అమ్మాయిలూ..: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీలో ఆదివారం భారత మహిళల జట్టుకూ చుక్కెదురైంది. ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్ లో భారత్ 1-2తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం చవిచూసింది. ప్రొ లీగ్లో భారత్ కు ఇది వరుసగా రెండో ఓటమి. శనివారం భారత్ 2-3తో ఆసీస్ చేతిలోనే ఓటమి పాలైంది. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే వైష్ణవి ఫాల్కే ఫీల్ గోల్ సాధించి భారత్ ఖాతా తెరిచింది. ప్రథమార్ధం ముగిసేసరికి భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. 37వ నిమిషంలో ఆసీస్ క్రీడాకారిణి ఎమీ లాటన్ గోల్ చేయడంతో 1-1తో స్కోరు సమమైంది. అక్కడ్నుంచి చివరి నిమిషం వరకు ఇరుజట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ డ్రాగా ముగుస్తుందనుకున్న సమయంలో ఆసీస్ రెండో గోల్ సాధించింది. 60వ నిమిషంలో లెక్సీ పికెరింగ్ పెనాల్టీ కార్నర్ను గోల్గా మలిచి భారత్ ఆశలపై నీళ్లు చల్లింది. మంగళవారం అర్జెంటీనాతో భారత్ తలపడనుంది.

## మేం పాత్రధారులమే.. హీరో అతనే : నాగార్జున-ధనుష్



ధనుష్, అక్కినేని నాగార్జున, రష్మిక మందన్న లీడ్ రోల్స్ లో తెరకెక్కిన ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'కుబేర'. ఈ సినిమాను దర్శకుడు శేఖర్ కమ్ముల డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఇంతకీ నాగార్జున ఏం మాట్లాడారు అంటే ఆయన మాటల్లోనే విందాం. నాగార్జున మాట్లాడుతూ..'నాకు ధనుష్ తో కలిసి నటించినందుకు హ్యాపీగా ఉంది. ధనుష్ మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను. ఇది కేవలం శేఖర్ కమ్ముల ఫిల్మ్. మేం పాత్రధారులం మాత్రమే. శేఖర్ తన కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి తీసిన సినిమా ఇది. మమ్మల్ని కూడా మా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తీసుకొచ్చాడు. 'మాయాబజార్' సినిమాలో ఎన్టీఆర్, ఏయన్నార్, ఎస్వీ రంగారావు.. వీరిలో హీరో ఎవరు ?, వారెవరూ కాదు కేవీ రెడ్డి (దర్శకుడు) హీరో. అలా కుబేర హీరో శేఖర్' అంటూ నాగార్జున తెలిపారు.

**ధనుష్ మాట్లాడుతూ...**

ఇంతకీ ధనుష్ ఏం మాట్లాడారు అంటే.. 'ఈ ఈవెంట్ లో నా పై ప్రదర్శించిన నా ఏవీ చూడగానే నాన్న గుర్తొచ్చారు. ఆయన వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను. ఈ సినిమా కోసం శేఖర్ సర్ చాలా కష్టపడ్డారు. 'కుబేర' తమిళ్లో నాకు 51వ సినిమా, తెలుగులో రెండో చిత్రం' అని ధనుష్ మాట్లాడారు. ధనుష్ ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి 'సార్' మూవీ కంటే ముందే నాకు శేఖర్ ఈ కథ చెప్పారు. ఇందులో నటించే అవకాశం ఇచ్చినందుకు ఆయనకు థాంక్స్. నాగార్జున సర్తో కలిసి నటించడం ఆనందంగా ఉంది. రష్మిక కష్టపడి పని చేస్తుంది' అని ధనుష్ చెప్పుకొచ్చాడు.

## తనతో నా కెమిస్ట్రీ బాగుంటుంది
# రష్మిక మందన్న

నాగార్జున, ధనుష్, రష్మిక ప్రధాన పాత్రల్లో 'కుబేర' ఈ నెల 20న రిలీజ్ కాబోతుంది. సినిమా పై మంచి బజ్ ఉంది. పైగా ట్రైలర్ కూడా జనంలోకి బాగా వెళ్లింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ లో రష్మిక మాట్లాడిన మాటలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. రష్మిక మాట్లాడుతూ.. 'నా సినీ ప్రయాణానికి సంబంధించి ఇక్కడ ప్రదర్శించిన వీడియో చూస్తే భయమేసింది. ఇన్ని రోల్స్ ప్లే చేశానా? అనే ఆశ్చర్యం కలిగింది. సాధారణంగా ఒక సినిమా పూర్తవడానికి ఏడాది పడుతుంది. ఆ సమయంలో చిత్ర బృందంతో క్లోజ్ అవుతుంటాం. నేను నా ఫ్యామిలీని కలిసి ఏడాది అయింది' అంటూ రష్మిక చెప్పింది. రష్మిక ఇంకా మాట్లాడుతూ.. 'శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటించాలన్న కల ఈ సినిమాతో నెరవేరింది. రియల్ లొకేషన్స్ లోనే ఆయన షూటింగ్ చేస్తారు. నాగార్జున సర్ తో నేను నటించిన రెండో



చిత్రమిది. ఆయన మంచి నటుడే కాదు మంచి వ్యక్తి. ధనుష్ తో కలిసి మరిన్ని సినిమాల్లో నటించాలనుంది. ఈ చిత్రంలోని మా కెమిస్ట్రీ ఆ అవకాశాలు అందిస్తుందనుకుంటున్నా' అని రష్మిక తెలిపింది. మొత్తానికి ఈ సినిమాలో రష్మిక బలమైన పాత్రలో కనిపించిందట. ఆమె పాత్ర ఎమోషన ల్ గానూ ఆకట్టుకుంటుందట.



## రాజా సాబ్ కోసం నిధి అగర్వాల్ తొలిసారి అలా..!

రాజా సాబ్ కోసం నిధి అగర్వాల్ ఓ కొత్త స్టెప్ వేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా టీజర్ కోసం నిధి అగర్వాల్ తన పాత్రకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పుకుందట. దీంతో ఆమె పాత్ర ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటుందో తనకు క్లారిటీ ఉందని నిధి కాన్ఫిడెంట్ గా చెబుతుంది. ఇక ఈ సినిమాలో ప్రభాస్ రెండు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తుండగా బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# టీజర్‌తో అదరగొట్టిన 'ది రాజా సాబ్'!

కమర్షియల్ డైరెక్టర్ మారుతి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో 'ది రాజా సాబ్' అనే భారీ పాన్ ఇండియా సినిమాని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా టీమ్ ఈ సినిమా టీజర్ ను విడుదల చేసింది. ఈ ఇల్లు నా దేహం, ఈ సంపద నా ప్రాణం అంటూ సాగిన ఈ టీజర్ వండర్ ఫుల్ గా ఉంది. ముఖ్యంగా ఇందులో ప్రభాస్ పవర్ ఫుల్ గా కనిపించారు. హీరోయిన్స్ తో లవ్ మూమెంట్స్ తో పాటు సంజయ్ దత్ రోల్ కూడా అదిరిపోయింది. ఇక విజువల్స్ తో పాటు ప్రభాస్ లుక్ అండ్ ఎలివేషన్ షాట్స్ కూడా అద్భుతంగా ఉన్నాయి. హీరోయిన్స్ ను రివీల్ చేసిన షాట్స్ కూడా చాలా బాగున్నాయి. టీజర్ లో మ్యూజిక్ అండ్ టేకింగ్ మరియు గ్రాఫిక్స్ కూడా చాలా బాగున్నాయి. మొత్తానికి ఈ టీజర్ చాలా బాగా ఆకట్టుకుంటోంది. కాగా టీజర్ ను బట్టి, ఈ సినిమాలోని విజువల్స్ వండర్ ఫుల్ గా ఉంటాయని, ముఖ్యంగా ఈ సినిమా లో వచ్చే యాక్షన్ విజువల్స్ మెయిన్ హైలైట్ గా నిలుస్తాయని అర్థం అవుతుంది. మొత్తమ్మీద మారుతి ఈ ప్రాజెక్ట్ కోసం అద్భుతమైన ఎలిమెంట్స్ ను సిద్ధం చేశాడు. పైగా ప్రభాస్ కి పూర్తిగా ఇది కొత్త జోనర్ అవుతుందట. కాగా ప్రభాస్ తో మారుతి హిట్ కొడితే.. ఇక మారుతి రేంజ్ మారిపోయినట్టే. అన్నట్టు ఈ సినిమాను దాదాపు రూ.300 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై టి.జి.విశ్వ ప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



# కుమార్తె హల్దీ వేడుకల్లో స్టార్ డైరెక్టర్ డ్యాన్స్

స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. స్వతహాగా తమిళుడు అయినప్పటికీ.. గజిని, తుపాకీ తదితర సినిమాలతో టాలీవుడ్ లోనూ మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. తర్వాత చిరంజీవితో 'స్టాలిన్', మహేశ్ బాబుతో 'స్పైడర్' సినిమాలు కూడా తీసి ఆకట్టుకున్నాడు. చాలా గ్యాప్ తర్వాత ఈ ఏడాది 'సికిందర్' మూవీతో వచ్చారు గానీ ఘోరమైన ఫ్లాప్ గా నిలిచింది. ప్రస్తుతం తమిళ హీరో శివకార్తికేయన్ తో 'మదరాసి' మూవీ చేస్తున్నారు. మురుగదాస్ ఇంట్లో ఫ్యామిలీ ఫంక్షన్ ఒకటి సోమవారం జరిగింది. అయితే ఇది మురుగదాస్ కూతురు దివ్య హల్దీ వేడుక అని అంటున్నారు. ఈ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది. సరే అసలు విషయానికొస్తే.. ఈ వేడుకలో మురుగదాస్ డ్యాన్స్ తో అదరగొట్టేశారు. కూతురు, కొడుకుతో కలిసి రీసెంట్ ట్రెండీ సాంగ్ 'కనిమా' పాటకు స్టెప్పులేశారు. ఈ వీడియో ఇప్పుడు



వైరల్ అవుతోంది. 2005లో మురుగదాస్₹కి పెళ్లి కాగా.. కొన్నాళ్లకు కొడుకు-కూతురు పుట్టారు. ప్రస్తుతం కూతురు పెళ్లి వేడుకకు ముందు జరిగే హల్దీ అంటున్నారు. మరికొందరు మాత్రం కూతురు రజస్వల వేడుక అని అంటున్నారు. ఏదేమైనా ఎప్పుడు సైలెంట్ గా ఉండే మురుగదాస్ మాత్రం కూతురు, కొడుకుతో కలిసి డ్యాన్స్ మాత్రం ఇరగదీశారని చెప్పొచ్చు. ఆ వీడియోపై మీరు ఓ లుక్కేసేయండి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.